ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 40.0
కనిష్ఠం : 28.0

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
మంగళవారం 10 జూన్ 2025



మావోయిస్టు సుధాకర్‌కు
అంతిమ వీడ్కోలు

- భౌతికకాయంపై ఎర్రజెండా ఉంచి సీపీఎం, సీపీఐ, ప్రజా సంఘాల నేతల నివాళి

పెదపాడు, జూన్ 9(ఆంధ్రజ్యోతి):పేదల హక్కుల కోసం అలుపెరగని, అవిశ్రాంత సాయుధ పోరాటంతో తనకంటూ ఓ స్థానాన్ని ఏర్పరచుకున్న మావోయిస్టు కీలకనేత తెంటు సుధాకర్ విప్లవ జ్యోతిగా చిరస్థాయిగా నిలిచిపోతారని సీపీఐ, సీపీఎం, ప్రజా సంఘాల నేతలు, రచయితలు కొనియాడారు. ఈ నెల ఐదో తేదీ ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఇంద్రావతి నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో సుధాకర్ మృతి చెందారు. ఆయన స్వస్థలం పెదపాడు మండలం సత్యవోలు. ఆయన భౌతికకాయాన్ని ఇక్కడకు తీసుకువచ్చి సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. తొలుత ఆయన భౌతికకాయంపై కమ్యూనిస్టు పార్టీల నేతలు ఎర్రజెండాను కప్పి విప్లవ గేయాలను ఆలపించారు. సుధాకర్ చేసిన పోరాటాలు, ఆయన ద్వారా పేదలకు జరిగిన లబ్ధిని గుర్తు చేశారు. ఆయుర్వేద వైద్య విద్యార్థిగా ఇంటి నుంచి దూరమై మావోయిస్టు జీవితంలో ఆఖరి శ్వాస వరకూ పేదల పక్షాన, వారి హక్కుల కోసం పోరా టం చేస్తూ ఊపిరి వదలడం కలిచివేస్తోందని కుటుంబ సభ్యులు ఆవేదన చెందారు. మావోయిస్టు అగ్రనేతగా ఎదిగిన ఈ ప్రాంత వాసిని కడసారి చూసేందుకు గ్రామస్తులతోపాటు వివిధ ప్రాంతాల నుంచి ఆయన స్నేహితులు, సన్నిహితులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టరుపై ఆయన భౌతికకాయాన్ని ఉంచి 'జోహార్ అమరజీవి సుధాకర్' అంటూ నినాదాల నడుమ ఊరేగింపుగా శ్మశాన వాటికకు తరలించారు. సుధాకర్ అన్న ఆనందరావు అంత్యక్రియలు నిర్వహించారు.

ఎస్జీటీ బదిలీలకు మాన్యువల్
కౌన్సెలింగ్ ఓకే!

ముగిసిన ఉద్యోగుల బదిలీలు

పలువురికి స్థానచలనం

పలు ఏఎంసీల్లో సెక్రటరీల మార్పు

- లోపలి పేజీలో..

జగన్, భారతిరెడ్డి క్షమాపణలు చెప్పాలి

సాక్షి పత్రిక, చానల్ నిషేధించాలంటూ పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో తెలుగు మహిళల నిరసనలు

పలుచోట్ల సాక్షి ప్రతుల దహనం

అబద్ధాలతో రాజధానిపై విషం కక్కుతున్న జగన్ మీడియా : ఎమ్మెల్యే పితాని

రాజధాని అమరావతిని డ్యామేజ్ చేయాలని వైసీపీ కుట్ర

అమరావతి మహిళలపై అసభ్య వ్యాఖ్యలకు నిరసనగా ఏలూరులో సాక్షి కార్యాలయం ముట్టడించిన మహిళలు

- లోపలి పేజీలో..



స్మార్ట్ షాక్



(నూజివీడు, ఆంధ్రజ్యోతి)

- ఇళ్లలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు
- ప్రభుత్వం అనుమతి
- నాడు పగలగొట్టాలని.. నేడు బిగించమంటున్నారు!
- వినియోగదారుల్లో సందేహాలెన్నో
- ముందుగానే ధర చెల్లించాలి?
- చిన్న పరిశ్రమలు, వ్యాపారులకు పెట్టుబడి భారం

విద్యుత్ సేవలు పొందిన వినియోగదారు చార్జీలు చెల్లించాలి. ఇక నుంచి ముందు చార్జీలు చెల్లిస్తేనే విద్యుత్ సరఫరా చేస్తారు. ముందుగా సొమ్ము చెల్లించి రీచార్జి చేసుకునేందుకు అనువుగా ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తోంది. విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేసే విధానంలో భాగమని పలువురు విమర్శిస్తున్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి కూడా ఇచ్చింది. ప్రతిపక్షంలో ఉండగా కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని టీడీపీ పిలుపునిచ్చింది. కూటమి ప్రభుత్వంలో అదే మీటర్ల ఏర్పాటుకు అనుమతి ఇవ్వడం శోచనీయం.

నివాస గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగించడానికి కూటమి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. నాటి ప్రతిపక్షంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించి నేడు పాలకపక్షం కాగానే అనుమతి ఇచ్చేసింది. ఇప్పటికే పలు చోట్ల కర్మాగారాలు, వ్యాపార సంస్థలకు స్మార్ట్‌మీటర్ల బిగింపు కార్యక్రమం ప్రారంభమైంది. ఇళ్లకు సైతం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మీటర్ల ఖరీదు కూడా వినియోగదారుడే భరించాలి. సింగిల్ ఫేజ్ మీటర్‌కు రూ.8927, త్రీఫేజ్ మీటర్‌కు రూ.17286 ధర నిర్ణయించినట్లు సమాచారం.

స్మార్ట్ మీటర్లు బిగిస్తే..

ప్రస్తుతం ఉన్న విద్యుత్ మీటర్లు కేవలం వినియోగదారుడు ఎంత విద్యుత్ వాడుకున్నది నమోదు చేసే పరికరం మాత్రమే. స్మార్ట్ మీటర్ బిగిస్తే అడ్వాన్స్ మీటరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఏఎంఐ), ఆటోమేటిక్ మీటర్ రీడింగ్ (ఏఎంఆర్) అనే రెండు వ్యవస్థలు ఉన్నాయి. ఏఎంఐ వ్యవస్థ ద్వారా ఇంట్లో మీటర్ ఎక్కడో ఉన్న బ్యాక్ ఆఫీస్‌కు వైర్‌లెస్ విధానంలో అనుసంధానమై ఉంటుంది. ఎక్కడో ఉండి ఈ మీటర్‌ను ఆపరేట్ చేయవచ్చు. రెండో వ్యవస్థ ఏఎంఆర్ ద్వారా ఏ సమయంలో ఎంత విద్యుత్ వాడామనే వివరాలు నమోదవుతాయి. పీక్ సమయంలో వినియోగం అనే పేరుతో అధిక చార్జీలు వసూలు చేయడానికి విద్యుత్ సంస్థకు ఈ విధానం ఉపయోగపడుతుంది. ప్రస్తుతం ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి 10 గంటల వరకు పీక్ సమయం. ఈ సమయంలో విద్యుత్ వినియోగంపై ఎక్కువ చార్జీలు వసూలు చేస్తారు. ఇది విద్యుత్ వినియోగదారుడికి గుదిబండ కానుందని పలువురు విశ్లేషిస్తున్నారు.

బిల్లు చెల్లింపులో వెసులుబాటు ఉండదు..!

ప్రస్తుతం అమలులో ఉన్న పోస్ట్ పెయిడ్ విధానంతో విద్యుత్ బిల్లు చెల్లించడానికి 15 రోజులు గడువు ఉంది. బిల్లు చెల్లించకపోతే అపరాధ రుసుంతో చెల్లించడానికి అవకాశం ఉంది. నిర్దిష్ట గడువు ముగిసిన తరువాత కూడా విద్యుత్ బిల్లు చెల్లించకపోతే కనెక్షన్ తొలగిస్తారు. అప్పటి దాకా వినియోగదారుడికి విద్యుత్ సరఫరా అందుతుంది. స్మార్ట్ మీటర్ విధానంలో ఈ అవకాశం ఉండదు. సెల్‌ఫోన్ రీచార్జి మాదిరి ముందే విద్యుత్ బిల్లు చెల్లించాలి. లేకపోతే వెంటనే విద్యుత్ సరఫరా ఆగిపోతుంది. ఈ విధానం వలన

మిగతా 8వ పేజీలో



ఐసీడీఎస్ ఆర్‌జేడీ సుజాత రాణికి పుష్పగుచ్ఛం ఇస్తున్న పీడీ శారద, ఈవో మల్లిక

ఐసీడీఎస్ ఆర్‌జేడీగా
సుజాత రాణి

ఏలూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మహిళా, శిశు అభివృద్ధి సంస్థ ఏలూరు ఆర్‌జేడీగా బి.సుజాత రాణి నియమితులయ్యారు. ఏలూరులో సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమగోదావరి జిల్లా ఐసీడీఎస్ పీడీగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడ నియమితులయ్యారు. సుజాత రాణిని ఐసీడీఎస్ పీడీ పెనుమాల శారద, ఈవో మల్లిక, ప్రసాద్, సిబ్బంది ఆమెను కలిసి అభినందించారు.

ఆర్‌అండ్‌బి ఎస్‌ఈగా విజయరత్నం

రోడ్లు భవనాల శాఖ (ఆర్‌అండ్‌బీ) ఎస్‌ఈగా కె.విజయరత్నం నియమితులయ్యారు. విజయవాడలో నేషనల్ హైవే ఇన్‌చార్జి ఎస్‌ఈగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఏలూరు ఎస్‌ఈ పి.భరతరత్నం ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్నారు.

కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, ధర్మరాజు

- త్వరలో కేంద్ర కమిటీ పర్యటన
- సమస్యలు నివేదించండి
- చేపల రైతుల సంఘం, కొల్లేరు ప్రజల ఐక్యవేదిక సదస్సు
- ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు సూచనలు

కైకలూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కొల్లేరు సమస్య శాశ్వత పరిష్కారానికి ఐక్యతతో కృషి చేద్దామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. కైకలూరులో రాష్ట్ర చేపల రైతుల సంఘం, కొల్లేరు ప్రజల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కొల్లేరు గ్రామాల ప్రజలు, రైతుల అవగాహన సమావేశం సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ త్వరలో కొల్లేరులో కేంద్ర సాధికారిక కమిటీ (సీఈసీ) పర్యటించనుందని, కొల్లేరు ప్రజల సమస్యలను కమిటీకి నివేదించాలన్నారు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని అన్ని కొల్లేరు గ్రామాల నుంచి పూర్తి సమా చారాన్ని సేకరించాలని సమావేశంలో పేర్కొన్నారు. కొల్లేరు సరస్సు లోని 14,800 ఎకరాల జిరాయితీ భూములు 7,100 ఎక రాలు డీఫామ్ పట్టాలను కచ్చితంగా తిరిగి ప్రజలు, రైతులకు అందించాలనే రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. పక్షులు, పర్యావరణంతో పాటు ప్రజలకు జీవనో పాధి కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కాంటూరు కుదింపు సాధ్యం కాదని కోర్టు తేల్చి చెప్పిందని, మిగతా 8వ పేజీలో



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ కిశోర్

కొవిడ్ వ్యాప్తిపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా పోలీస్ కార్యాలయంలో అర్జీలు స్వీకరించిన ఎస్పీ

ఏలూరు క్రైం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ కేసులు పెరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ కిశోర్, ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అర్జీలు స్వీకరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఉపయోగించి ఫిర్యాదుల ప్రక్రియను పారదర్శకంగా కాగిత రహితంగా నిర్వహించారు. ఫిర్యాదుదారు ఏఐ బోర్డు వద్దకు వెళ్లి వీడియో రికార్డింగ్ ద్వారా అర్జీ అందజేశారు. ఎస్పీ కిశోర్, ఏఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్య పరిష్కారానికి సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 40 మంది తమ ఫిర్యాదులను సమర్పించారు.

డీఎస్సీ పరీక్షలకు 40మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన పరీక్షకు స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో ఉదయం 180 మంది అభ్యర్థులకు 179మంది, మధ్యాహ్నం 180మందికి 159మంది హాజరయ్యారు. సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రానికి ఉదయం 200మందికి 196 మంది, మధ్యాహ్నం 200మందికి 186మంది హాజరయ్యారు. మొత్తంమీద 40మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు.

జాతీయ ఉత్కర్ష అభియాన్ పక్కాగా అమలు : కలెక్టర్

ఏలూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గిరిజనులకు ధర్తీ అభజన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో సమీక్షించారు. ఈ నెల 30 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గిరిజనులకు ఆధార్‌కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు అందించాలన్నారు.

విద్యా రంగంలో
జిల్లా ఆదర్శం కావాలి

- మంత్రి నాదెండ్ల మనోహర్
- పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రతిభావంతులకు సత్కారం



షైనింగ్ స్టార్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

పెదపాడు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యరంగంలో వినూత్న మార్పులతో జిల్లాను ఆదర్శవంతంగా నిలపాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. వట్లూరులోని సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన షైనింగ్ స్టార్ కార్యక్రమాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం ప్రారంభించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన 163 ఉన్నత పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు చెక్కులను అందజేసి సర్టిఫికెట్లతో సత్కరించారు. జిల్లాలో 2.78 లక్షల మంది విద్యార్థులుండగా 1.30 లక్షల మంది మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారని, ఈ సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని మంత్రి నాదెండ్ల సూచించారు. జిల్లా పరిషత్ నుంచి విద్యారంగానికి ఎక్కువ నిధులు కేటాయించాలని, జిల్లాలో 10 వేలమంది ఉపాధ్యాయులున్నారని, మెరుగైన విద్యనందించాలని కోరారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ షైనింగ్ స్టార్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు సన్మానం శుభపరిణామన్నారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గంలో ఒక పాఠశాలను దత్తత తీసుకుని మూడు బస్సుల రవాణాతో అన్ని సౌకర్యాల కల్పనతో ఉత్తమ పాఠశాలగా తీర్చిదిద్దుతానన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ జిల్లాపరిషత్ తరపున విజయకేతనం పుస్తకాన్ని విద్యార్థులకు అందజేశామని, పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించగలిగామన్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఆర్టీసీ రీజియన్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఎస్పీ కిశోర్, జేసీ ధాత్రిరెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ గారపాటి రామసీత, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో అభివృద్ధి, విజన్ ప్లాన్ అమలు చేయాలి

ఏలూరు సిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అభివృద్ధి విజన్ ప్లాన్ అమలుపై అధికారులు దృష్టి సారించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. అమరావతి నుంచి సోమవారం రాష్ట్ర, జిల్లా నియోజకవర్గాల విజన్ ప్లాన్‌ను ముఖ్యమంత్రి వర్చువల్‌గా విడుదల చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులకు మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా, నియోజకవర్గ అభివృద్ధి విజన్ ప్లాన్‌పై దిశా నిర్దేశం చేశారు. మొదటి సంవత్సరం 6 ప్రధాన రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వ్యవసాయంతో పాటు పారిశ్రామికాభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు మంచి అవకాశాలున్నాయని, వనరులను వినియోగించుకుని అభివృద్ధి దిశగా జిల్లాను ముందుకు తీసుకువెళ్లాలన్నారు. పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయడంతోపాటు పర్యాటకులు బస చేసేందుకు మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలన్నారు. పేదరిక నిర్మూలన కోసం ప్రజల తలసరి ఆదాయాన్ని పెంచే విధంగా జిల్లా, నియోజకవర్గ విజన్ ప్లాన్ అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. పీ4 కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు బంగారు కుటుంబాలు, మార్గదర్శకులను గుర్తించే చర్యలను వేగవంతం చేయాలన్నారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, జేసీ పి.ధాత్రిరెడ్డి, డీఆర్వో వి విశ్వేశ్వరరావు, సీపీవో వాసుదేవరావు, అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లోని ముఖ్యప్రణాళికాధికారి కార్యాలయంలో విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాన్ని మంత్రి మనోహర్ ప్రారంభించారు. స్వర్ణాంధ్ర విజన్-2047 యాక్షన్ ప్లాన్‌లో భాగంగా జిల్లా, నియోజకవర్గాల విజన్ డాక్యుమెంట్స్ రూపొందించినట్లు తెలిపారు. యూనిట్ కార్యాలయంలో ఎమ్మెల్యేతో పాటు జిల్లా స్థాయి అధికారి నోడల్ అధికారిగా ఉంటారని, ఎమ్మెల్సీ, విద్యావేత్త, సంబంధిత టీమ్ సభ్యులు ఐదుగురితో కలిపి మొత్తం 9 మంది ఉంటారన్నారు.

సమన్వయంతో ముందుకు..



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి వర్మ

- ఏడాది పాలనపై కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

భీమవరం టౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి):'కేంద్ర మంత్రిగా ఏడాది కాలంలో జిల్లాలోని ఏడుగురు ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టా. నా దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను చిత్తశుద్ధితో పరిష్కరించా' అని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో సోమవారం కూటమి నాయకులతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఏడాది కాలంలో కొత్త ప్రాజెక్టులు సాధించాం. లోసరి- భీమవరం-పిప్పర రహదారి అభివృద్ధికి సీఆర్ఎఫ్ కింద రూ.100 కోట్లు నిధులు మంజూరు, ఎన్‌హెచ్ 165 ఫేజ్-2 ఆకివీడు-దిగమర్రు రహదారి నిర్మాణ సమస్యను పరిష్కరించాం. అలైన్మెంట్ మార్పు చేసి రెండు లైన్లను నాలుగు లైన్ల రోడ్డుగా మార్చి కేంద్రం నుంచి అనుమతులు సాధించాం. రూ.2,500 కోట్లతో డీపీఆర్ సమర్పించాం, గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశాం. భూములు ఇచ్చిన రైతులకు రూ.25 కోట్ల నష్టపరిహారం ఇప్పించాం. పీఎం గతిశక్తి ప్రాజెక్ట్ ద్వారా పార్లమెంట్ పరిధిలో మూడు ఆర్‌వోబీల నిర్మాణానికి రూ.200 కోట్లు మంజూరయ్యాయి. చెన్నై నుంచి విజయవాడ వరకు ఉన్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను నరసాపురం వరకు పొడిగిస్తున్నాం. కొద్ది రోజుల్లోనే ఇది పట్టాలెక్కుతుంది. హైదరాబాద్-విశాఖపట్నం వందే భారత్‌కు తాడేపల్లిగూడెంలో హాల్ట్ కల్పించాం. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు సీఎస్ఆర్ నిధులు రూ.10 కోట్లు మంజూరు చేయించాం. నరసాపురం నియోజవర్గంలోని పీహెచ్‌సీల్లో అత్యాధునిక వైద్య పరికరాలు, భవనాల మరమ్మతులకు రూ.80 లక్షల సీఎస్ఆర్ నిధుల మంజూరుచేశాం' అని మంత్రి తెలిపారు. సమావేశంలో భీమవరం, తణుకు, నరసాపురం ఎమ్మెల్యేలు పులపర్తి అంజిబాబు, ఆరిమిల్లి రాధాకృష్ణ, బొమ్మిడి నాయకర్, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, గారపాటి సీతారామాంజనేయులు, అయినంపూడి శ్రీదేవి పాల్గొన్నారు.



యోగాంధ్ర

ఏలూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): యోగాంధ్రలో భాగంగా స్థానిక ఇండోర్ స్టేడియంలో సోమవారం అధికారులు, ప్రజా ప్రతినిధులు యోగాసనాలు వేశారు. సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్ నుంచి స్టేడియం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జేసీ పి.ధాత్రిరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ షేక్ నూర్జహాన్ ర్యాలీలో సాగారు. కలెక్టర్ మాట్లాడుతూ దైనందిన జీవితంలో యోగాభ్యాసన భాగం కావాలన్నారు. ప్రజలు 21న యోగాంధ్రను విజయవంతం చేయాలని వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, నగర కమిషనర్ ఎ.భానుప్రతాప్ పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం..

పెదపాడు: ప్రతిభావంతులైన విద్యార్థులకు సత్కారం అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్ వారితో కలిసి భోజనం చేశారు. మంత్రితో పాటు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కిశోర్, జేసీ ధాత్రిరెడ్డి కూడా పిల్లలతో కలసి భోజనం చేశారు. కలెక్టర్ వెట్రిసెల్వి కొద్దిసేపు విద్యార్థులకు స్వయంగా వంటకాలను వడ్డించారు. మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని పిల్లలకు సూచించారు. మంత్రి, అధికారులతో భోజనం చేయడంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న మంత్రి నాదెండ్ల



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు, పామాయిల్ రైతులు

ఆయిల్ పామ్ రైతుల ధర్నా

ఏలూరు రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం నుంచి ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 27.5 శాతం నుంచి 16.5 శాతానికి తగ్గించడం వల్ల పామాయిల్ గెలలు ధర పడిపోయి నష్టపోతున్నామంటూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం , ఆయిల్ పామ్ రైతుల సంఘం ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ ముందు రైతులు సోమవారం ధర్నా నిర్వహించారు. రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల ఒక్కసారిగా ఆయిల్ పామ్ రైతులు కుదేలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల ముందు పామాయిల్ దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం పూర్తిగా సుంకాలు ఎత్తివేయడంతో ఆయిల్ పామ్ గెలలు ధరలు భారీగా పడిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని గుర్తు చేశారు. దిగుమతి సుంకం పెంచడం వల్ల రూ.20,290లకు టన్ను ఆయిల్ పామ్ గెలలు ధర పెరిగిందని చెప్పారు. ఈ ధర మరో రూ.2 వేలు తగ్గి సుమారు రూ.16 వేలకు ధర పడిపోనుందని ఆందోళన వ్యక్తం చేశారు. విదేశీ వంట నూనెల దిగుమతులు తగ్గించుకోవడం కోసం పామాయిల్ సాగును ప్రోత్సహించారని, దేశంలోనే అత్యధిక ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం ఆంధ్రప్రదేశ్‌లోనే ఉందని, ఏలూరు జిల్లాలో అత్యధిక సాగు విస్తీర్ణం ఉందని వివరించారు. ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లు రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, జిల్లా సహాయ కార్యదర్శి సిరిబత్తుల సీతారామయ్య, ఆయిల్ పామ్ రైతుల సంఘం నాయకుల గంటా పాపారావు, దాసరి జానకి రామరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏకైక ఆయిల్ ఫెడ్ కర్మాగారం పెదవేగిలోనే ఉందన్నారు. మన రాష్ట్రంలో మాత్రం ఆయిల్ ఫెడ్ కర్మాగారం అభివృద్ధి జరగలేదన్నారు. ధర్నా అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. మున్నంగి సుబ్బారెడ్డి, కోనేరు సతీష్‌బాబు, శ్రీనివాసరావు, వీరారెడ్డి, మొరంపూడి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



పెద అమిరంలో నివేదిత విద్యాలయం ప్రారంభిస్తున్న శారదా మఠం అధ్యక్షురాలు ప్రవాజిత భవానీప్రాణ మాతాజీ, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి

'నివేదిత విద్యాలయం' ఏర్పాటు అభినందనీయం

కాళ్ళ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : నేటితరం బాలికలకు బాసటగా ఉండే విధంగా నివేదిత విద్యాలయం ఏర్పాటు అభినందనీయమని గుంటూరు శారదామఠం అధ్యక్షురాలు ప్రవాజిక భవానీప్రాణ మాతాజీ అన్నారు. కాళ్ళ మండలం పెద అమిరంలోని వివేకానంద సేవా సమితి భవనం ప్రాంగణంలో నిర్మించిన నివేదిత విద్యాలయం సోమవారం ఉదయం ప్రారంభించి మాట్లాడారు. బాలికలకు ఉచిత విద్య అందించాలనే లక్ష్యంతో ఎల్‌కేజీ నుంచి 7వ తరగతి వరకు ఆంగ్ల భాషలో కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్యతో పాటు వ్యక్తిత్వ వికాస శిక్షణ, యోగా, భగవద్గీత వంటి ఆధ్యాత్మిక విలువలతో కూడిన తరగతులు నిర్వహణకు శ్రీకారం చుట్టిన వేగిరాజు శివవర్మ దంపతులను అభినందించారు. ముఖ్య అతిథి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి క్లాస్ రూమ్‌లను ప్రారంభించి విద్యార్థులకు ఏర్పాటు చేసిన వసతి పరిశీలించారు. విద్యాలయం ప్రాంగణంలో ప్రవాజిక భవానీప్రాణ మాతాజీ, కలెక్టర్ నాగరాణి మొక్కలను నాటారు. శారదా పీఠం మాతాజీలు ప్రవ్రాజిక త్యాగనిష్ఠ ప్రాణ, ప్రవాజిక దివ్యాత్మ ప్రాణ, తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షురాలు గంగవరం శ్రీదేవి, రామకృష్ణ మిషన్ పాలకవర్గ సభ్యురాలు డాక్టర్ లింగారెడ్డి ఉమాదేవి, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మంతెన రామచంద్రరాజు, యూత్ హాస్టల్స్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ వివిజె సోమరాజు, కంతేటి వెంకట్రాజు పాల్గొన్నారు.

చినవెంకన్నకు మాజీ ఎంపీ రవీంద్ర కుమార్ పూజలు

ద్వారకాతిరుమల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయాన్ని రాజ్యసభ మాజీ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ సోమవారం ఉదయం సందర్శించారు. ఆలయానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. ముందుగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఆలయ ముఖ మండపంలో ఆయనకు అర్చకులు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ డిప్యూటి ఈవో బాబూరావు, ఏఈవో నటరాజారావులు ఆయనకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.



శ్రీవారి చిత్రపటాన్ని అందుకుంటున్న మాజీ ఎంపీ రవీంద్ర

చందుకు ఉత్తమ రైతు అవార్డు



మొగల్తూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రామన్నపాలెం పంచాయతీ ఆకనవారి తోటకు చెందిన అయితం రాన్ చందు ఆచార్య ఎన్.జి రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ ప్రకటించిన ఉత్తమ రైతు అవార్డుకు ఎంపికయ్యారు. 2023-24 సంవత్సరానికి గాను యూనివర్సిటీ ప్రకటించే డాక్టర్ ఎంవీ రెడ్డి ఉత్తమ రైతు అవార్డు కింద చందుకు రూ.25 వేలు నగదు బహుమతితో పాటు, మెమెంటో, సర్టిఫికెట్ ప్రదానం చేయనున్నారు. ఈనెల 12న డాక్టర్ రెడ్డి ఫౌండేషన్ 61వ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని గుంటూరులోని కృష్ణా ఆడిటోరియంలో అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో బహుమతి ప్రదానం జరుగుతుందని ఈ మేరకు యూనివర్సిటీ డైరక్టర్ డాక్టర్ పాలడుగు సత్యనారాయణ నుంచి ఆహ్వానం వచ్చినట్టు చందు తెలిపారు.



ఈ గ్రామానికి చెరువే లేదాయె !

డెల్టా ప్రాంతం అంటే ఎటు చూసినా పంట కాలువలు, పిల్ల కాలువలు.. వాటిని చేర్చి చెరువులు ఉండడం సాధారణంగా కనిపించే దృశ్యాలు. డెల్టా ప్రాంతంలోని పాలకోడేరు మండలం వేంద్ర అగ్రహారంలో మంచినీటి చెరువుగాని, పశువుల చెరువుగాని లేదు. గ్రామంలో సుమారు 700 మంది జనాభా ఉంటారు. ఎక్కువ మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తుంటారు. ఆదాయ వనరులు అంతంత మాత్రమే. కుళాయి పన్ను, ఇంటి పన్నుల రూపంలో సుమారు ఏడాదికి వచ్చి లక్షా 40 వేల రూపాయలు ఆదాయం ఉంటుంది. ఈ గ్రామంలో చెరువు లేకపోవడంతో గ్రామస్థులు బోరు నీటి మీదే ఆధారపడుతున్నారు. అగ్ని ప్రమాదం జరిగినా, పశువులకు నీరు పెట్టుకోవాలన్నా బోరు నీరే ఆధారం. భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా ఓ చెరువును గ్రామానికి తవ్వించి ప్రజల అవసరాలను తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

-పాలకోడేరు (ఆంధ్రజ్యోతి)

కలిసొచ్చిన కోకో..

పెరుగుతున్న పెట్టుబడి వ్యయానికి అనుగుణంగా ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు రైతులు అంతరపంటల సాగు చేపడుతున్నారు. మెట్టప్రాంతంలో ఎక్కువగా సాగయ్యే కొబ్బరి, ఆయిల్‌పామ్, నిమ్మ వంటి ప్రధాన పంటలతో పాటు కోకోను అంతర పంటగా సాగు చేస్తున్నారు. దీంతో ఆర్థిక ఇబ్బందుల నుంచి కొంతమేర బయటపడుతున్నారు.





సాభసాటిగా అంతర పంట

గతేడాది రికార్డు ధర..

సాగుకు రైతుల మొగ్గు

అంతర్జాతీయ ధరకు అనుగుణంగా ధర చెల్లించాలి

పెదవేగి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలో 32,451 ఎకరాల విస్తీర్ణంలో కొబ్బరి, ఆయిల్ పామ్ తోటల్లో అంతర పంటగా కోకో సాగు చేస్తున్నారు. ఒక్క పెదవేగి మండలంలోనే ఎనిమిది వేల ఎకరాలవరకు సాగు జరుగుతోంది. ఏడాది పొడవునా కాపు ఉన్నప్పటికీ ప్రధానంగా మార్చి నెలనుంచి మే నెలాఖరు వరకు మూడునెలల పాటు కోకో దిగుబడి బాగుంటుంది. ఈ సమయంలో వచ్చిన గింజలు అధిక నాణ్యత కలిగి, మెరుగైన ధర వస్తుందని రైతులు చెప్తున్నారు. ఎకరానికి సరాసరిన ఐదు క్వింటాళ్ళ దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు.

రికార్డు ధర

కోకో గింజలు రెండేళ్ల కిందటివరకు అత్యధిక ధర కిలో రూ.245. గతేడాది ఏడాది ప్రారంభ ధరే రూ.255. అక్కడ నుంచి పెరుగుతూ గత 2024 ఏప్రిల్ నెలాఖరు నాటికి రూ.వెయ్యి ధరను రైతులు అందుకున్నారు. అక్కడ నుంచి క్రమేణా తగ్గుతూ రూ.550 దగ్గర కొంతకాలం నిలకడగా ఉండి ప్రస్తుతం రూ.450 ధర ఉంది. ధర పెరుగుదలకు ప్రధాన కారణం కోకో ఎక్కువగా పండించే ఘనా లాంటి ఆఫ్రికా దేశాల్లో కోకోపంట తెగుళ్లకు గురై, తోటలన్నీ తొలగించడమేనని, దీంతో స్థానికంగా ఉన్న పంటకు డిమాండ్ పెరిగి, ధర పెరిగినట్టు చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఏడాది కొందట కిలో రూ.వెయ్యి ఉన్న ధర ఇప్పుడు రూ.450కు పడిపోవడంతో నష్టాలను ఎదుర్కొంటున్నామని కౌలు రైతుల చెబుతున్నారు. గతేడాది ధరను చూసి అధిక కౌలు చెల్లించి తోటలు తీసుకున్నామని ఇప్పుడు తగ్గిన ధరతో కౌలుసొమ్ము కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. అయితే రైతుల విజ్ఞప్తుల నేపథ్యంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, కిలోకు రూ.50 ప్రకటించింది. ఈ సొమ్మును కొనుగోలు సంస్థలకే చెల్లిస్తుండడంతో రైతుకు మొత్తంగా కిలోకు రూ.500 లభిస్తోంది.

- **ధర పెరిగినా లాభం లేదు**



రెండేళ్ల కిందట ధరతో పోల్చితే ఇప్పుడు ధరలో పెరుగుదల ఉంది. కానీ పెట్టుబడి వ్యయం మాత్రం అంతకు రెట్టింపైంది. దీంతో ధర పెరిగినా ఆదాయంలో పెరుగుదల కన్పించడం లేదు. సాధారణంగా ఏటా ఎకరానికి ఐదు క్వింటాళ్లకు తగ్గకుండా దిగు బడి వచ్చేది. ఇప్పుడు మూడు క్వింటాళ్లకు మించి దిగుబడి రావడం లేదు. దీంతో అప్పుడు ధర రూ.240 ఉన్నా, ఇప్పుడు రూ.500 లకు పెరిగినా పెద్దగా లాభమేమీ లేదు. కనీస ధర రూ.600 ఉంటే లాభదాయకంగా ఉంటుంది.

- ఆలపాటి సత్యనారాయణ, కోకో రైతు, పెదవేగి

- **దిగుబడి పడిపోయింది**



అకాలవర్షం, ఆపై వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా కోకో పూత తగ్గింది. ఈ ప్రభావంతో దాదాపు 20 శాతానికి పంట దిగుబడి పడిపోయింది. ప్రతి సంవత్సరం ఎకరానికి సరాసరిన ఏడు క్వింటాళ్లకు తగ్గకుండా దిగుబడి వచ్చేది. ఇప్పుడు మూడు క్వింటాళ్లకు పంట దిగుమతి తగ్గడంతో కొంతమేర ఆదాయం తగ్గింది. స్థానికంగా పంటకు డిమాండ్ పెరిగి, రైతులు ఆర్థికంగా బలపడే అవకాశం ఉంది. కానీ ఆశించిన ధర మాత్రం రైతుకు దక్కడం లేదు.

- ఉంద్రు అంబేద్కర్, కోకో రైతు తాళ్ళగోకవరం

- **కిలోకు రూ.50 బోనస్**



కోకో రైతులను ఆదుకోవడానికి అనువుగా ప్రభుత్వం కిలోకు రూ.50 బోనస్ అందిస్తోంది. ఈ సొమ్ము నేరుగా కొనుగోలు కంపెనీలే చెల్లిస్తాయి. దీంతోపాటు కోకో సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం వివిధ రాయితీ పథకాలను అందిస్తోంది. మొక్కల పంపిణీ నుంచి మూడేళ్లపాటు వాటి నిర్వహణా వ్యయాన్ని ప్రభుత్వం రాయితీగా అందిస్తోంది. మొక్క నాటిన తొలిఏడాది హెక్టారుకు రూ.12 వేలు, ఆపై రెండేళ్లపాటు ఏడాదికి రూ.4 వేలు చొప్పున రూ.8 వేలు ప్రభుత్వం రాయితీగా చెల్లి స్తోంది. దీంతోపాటు అవసరమైన ఇతర యంత్ర పరికరాలను ప్రభుత్వం రాయితీపై సరఫరా చేస్తుంది.

- ఎం.రత్నమాల, మండల ఉద్యాన శాఖాధికారి, పెదవేగి

నూజివీడు మామిడికి గడ్డుకాలం

(నూజివీడు ఆంధ్రజ్యోతి) : మామిడి అనగానే సహజంగానే అందరికీ గుర్తుకు వచ్చేది నూజివీడు.. ఈ ఏడాది ఈ ప్రాంత మామిడి రైతు దారుణంగా కుదేలయ్యాడు. మార్కెట్‌లో కొనేనాథుడు లేక రైతులు తమ పంటను కోయకుండానే చెట్టుపైనే వదిలేస్తున్నారు. పచ్చడికి ఉపయోగపడే తోతాపురి(కలెక్టర్) కాయను టన్ను రూ.3 వేలకు కూడా కొనే పరిస్థితి లేదు. చివరకు ముక్కల కర్మాగారాలు మూతపడ్డాయి. ప్రస్తుతం అతి కష్టం మీద కలెక్టర్ కాయ రూ.2 వేల నుంచి రూ.5 వేలు పలుకోతుంది. ఈ ధర రైతుకు కాయ కోత కోయడానికి కూలీలకు, ట్రాన్స్‌పోర్టుకు కూడా సరిపోవడం లేదు. నూజివీడుతోపాటు చిత్తూరు జిల్లాలో మామిడి విస్తారంగా సాగవుతుంది. అక్కడ నూజివీడుకన్నా ఎక్కువ సంఖ్యలో మామిడి పల్ప్ పరిశ్రమలు ఉన్నాయి. గత ఏడాది ఉత్పత్తి నిల్వలు మిగిలిపోవడం, ఈ ఏడాది ఎగుమతులు లేకపోవడం కారణంగా ఉత్పత్తి నిలిపివేశారు. అక్కడ కలెక్టర్ కాయకొనే పరిస్థితి లేకపోవడంతో ఆ ప్రాంత రైతు సంఘాలు, మామిడి రైతులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు.



కొనేవారు లేకపోవడంతో మామిడి కాయలను గోతిలో వేసి పూడుస్తున్న దృశ్యం

కొద్ది రోజుల క్రితం చిత్తూరు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అందరూ చర్చించి రైతుల పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో ప్రభుత్వం స్పందించి టన్ను రూ.12 వేలకు కలెక్టర్ కాయ కొనాలని పల్ప్ కర్మాగారాల యజమానులను ఆదేశించారు. దానిలో నాలుగు వేలు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని స్పష్టం చేశారు. దీనిపై సమీక్షించడానికి స్వయంగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఈ నెల 12న చిత్తూరులో పర్యటించనున్నారు.

మూతపడ్డ పల్ప్ యూనిట్లు

నూజివీడులో ఐదు పల్ప్ ఉత్పత్తి కర్మాగారాలు ఉన్నాయి. అవి మూతపడి సంవత్సరాలు అయ్యింది. నూజివీడు ప్రాంతంలో రైతు సంఘాలు బలంగా లేకపోవడం రైతుల్లో ఐక్యత లేకపోవడం ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యం వల్ల మామిడి రైతులకు ప్రతీ ఏటా తీవ్ర నష్టం జరుగుతోంది. ఇక్కడ మామిడి పరిశోధన కేంద్రం, రూ.40 కోట్లతో నిర్మించిన వేపర్ హీట్ ట్రీట్మెంట్ ప్లాంట్ రైతులకు ఏమాత్రం ఉపయోగపడటం లేదు. ట్రీట్మెంట్ ప్లాంట్ మూతబడి నాలుగేళ్లు అయ్యింది. పల్ప్ కేంద్రాలు పనిచేస్తున్నట్లయితే తోతాపురి కాయలకు కనీస ధర అయినా అందేదని అంటున్నారు.

ప్రతిసారి వాగ్దానాలే

ప్రతి ఎన్నికల సమయంలోనూ అన్ని రాజకీయ పార్టీల నాయకులు నూజివీడు నియోజకవర్గం మామిడి సమస్యలను పరిష్కరిస్తామని వాగ్దానాలు ఇవ్వడం షరా మామూలైంది. ఐదేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వం నూజివీడు శివారులోని సిద్ధార్థనగర్‌లో మామిడి అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నట్లు చేసిన ప్రకటన ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. ఇక ప్రస్తుతం విజయవాడలో ఉన్న మార్కెట్ లాగా నూజివీడు మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేస్తామని చేసిన హామీ కాగితాలకే పరిమితమైంది. మామిడి పంట చివరి దశకు వచ్చింది. రాజకీయ నాయకులు, రైతు సంఘాలు వెంటనే దృష్టి సారించి చిత్తూరులో మాదిరి తమను ఆదుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని నూజివీడు రైతులు కోరుతోంది.

ధర లేక కుదేలైన రైతులు

ప్రతి ఏటా నష్టాల పాలు

చిత్తూరు ధర ఇక్కడా ఇవ్వండి : రైతుల డిమాండ్

మామిడి రైతులను ఆదుకోవాలి



చిత్తూరు జిల్లాలో మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకున్న విధంగా నూజివీడు ప్రాంతంలోని మామిడి రైతులను ఈ ప్రభుత్వం ఆదుకోవాలి. మ్యాంగో బోర్డును ఏర్పాటు చేసే ప్రయత్నాలు వెంటనే ప్రారంభం కావాలి. బోర్డు ఉంటే పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించుకుని ప్రభుత్వం ద్వారా పరిస్థితిని చక్కదిద్దుకునే అవకాశం ఉండేది. మామిడికి ఉన్న ఇన్సూరెన్స్ పథకం ఏమాత్రం రైతులకు ఉపయోగపడలేదు. ఒక్క రైతుకు కూడా ఇన్సూరెన్స్ ఇచ్చిన పరిస్థితి లేదు. మూతబడిన పల్ప్ యూనిట్లు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలి.

లావు నాగ వరప్రసాద్, మామిడి రైతు

నిలకడగా కూరగాయల ధరలు



తాడేపల్లిగూడెం మార్కెట్‌లో కూరగాయల విక్రయాలు

పెంటపాడు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెం మార్కెట్ ఆదివారం కూరగాయల ధరలు నిలకడగా కొనసాగాయి . గతవారం మాదిరిగా ఉల్లి పాయలు రకాన్ని బట్టి 4 కేజీలు రూ.100 , 5 కేజీలు రూ.100 అమ్మకాలు సాగించారు. ఉల్లి పాయల ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. మండే ఎండల కారణంగా కూరగాయల ధరలు పెరగడం లేదని తెలుపుతున్నారు. దీంతో కూరగాయల ధరలు ఈ వారం కూడా నిలకడగానే కొనసాగాయి మార్కెట్‌లో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. కేజీ టమోటో రూ.20, బీరకాయలు కేజీ రూ.50, దొండకాయలు రూ 30, తెల్ల వంకాయిలు కేజీ రూ.50, నల్లవంకాయిలు కేజీ రూ.40, అల్లం కేజీ రూ 60, ములక్కాడలు 3 రూ.20, అనపకాయ రూ.15, దోసకాయలు రూ.30, అరిటికాయలు 3 రూ.20, క్యాబేజి రూ.30, బీట్‌రూట్ కేజీ రూ.40, బీన్స్ రూ.80, కాప్సికం రూ.60, పచ్చి మిరపకాయలు కేజీ రూ.40 చొప్పున విక్రయాలు సాగాయి. ఇక నూనె ధరలకు వస్తే పామాయిల్ 900 గ్రాముల ప్యాకెట్ గత వారం రూ.115 ఉండగా ఈవారం మాత్రం రూ.110 లకు చేరింది. వేరుశనగ ప్యాకెట్ రూ.135, సన్‌ఫ్లవర్ రకాన్ని బట్టి రూ.140, రూ.150 పలికాయి.



చవక.. రండి..రండి



రోడ్డుపక్కన..మండుటెండలో..



మండుటెండలో బతుకు వేట

గణపవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఎండలు చుర్రుమంటున్నాయి. వేడి గాలులకు ప్రజలు అల్లాడిపోతున్నారు. కాలు బయట పెట్టాలంటే భయమేస్తోంది.. కానీ వారికి మాత్రం ఎండా కొండా లేదు.. కిలోమీటర్ల దూరం నుంచి మండుటెండల్లో ఒక చేతితో గంప, మరో చేతితో క్యారేజీ పట్టుకుని చిరు వ్యాపారులు పొట్ట కూటికోసం తరలి వస్తున్నారు. ఏరోజుకారోజు ఎంతో కొంత అమ్ముకుంటే గానీ రోజుగడవని చిరు వ్యాపారులకు ఎండలు చుక్కలు చూపిస్తున్నాయి. గణపవరం సెంటర్‌లో రోజూ నిమ్మకాయలు, బొప్పాయి, మామిడి, తాటిముంజులు, పీతలు, చేపలు, రొయ్యలు ఇలా రకరకాలు రోడ్డు పక్కన పెట్టుకుని అమ్ముతుంటారు. మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలు దాటుతున్నాయి. రెక్కాడితేకానీ డొక్కాడని నిరుపేదలు తమ బతుకుబండిని నడిపించేందుకు రోడ్డెక్కాల్సి వస్తుంది. ఎండలు లెక్కచేయకుండా గణపవరం నుంచి ఏలూరు, అలాగే గణపవరం, ఇటు తాడేపల్లిగూడెం అటు భీమవరం వెళ్తే రహదారుల వెంబడి చిరువ్యాపారులు విక్రయాలు చేస్తున్నారు.



కూల్..కూల్ కుండలు



ముంజెలు సార్..

- **ఎండయినా తప్పదుగా..**

ఎండయినా వ్యాపారం చెయ్యక తప్పదు. కాకినాడ నుంచి పీతలు తీసుకొచ్చి బొబ్బిలి వంతెన వద్ద అమ్ముతుంటాను. వేసవిలో పీతల కొనుగోళ్లు తగ్గుతాయి. ఇప్పటి వరకు పెళ్లిళ్ల సీజన్ కావడంతో వ్యాపారాలు చేస్తున్నాం. కనీసం కూలి గిట్టుబాటు కావడం లేదు. ఒకరోజులో తెచ్చిన మొత్తం అయిపోతాయి. మరోరోజు అవ్వవు. మిగిలినవి గంపలో పెట్టుకుని కాకినాడకు వెళ్లిపోతాం. అమ్మకపోతే వినియోగదారులకు అలవాటు తప్పుతుంది.

- మహేశ్వరి, పీతల వ్యాపారి, కాకినాడ

- **రోజుకు రూ.1300 వరకు అమ్ముతా**



తాటిముంజుల సీజన్‌లో నీలాద్రి పురం నుంచి ఇక్క డకు వచ్చి అమ్ము తుంటా. గతంలో డజను రూ.50 చొప్పున విక్రయించేవాళ్లం. అందరూ లేతముంజులు కావాలంటారు. కావర్లో పెట్టాక కొన్ని పక్కనపెడతారు. ఎండల్లో అమ్ముతున్నామనే కనికరం లేకుండా బేరాలు ఆడుతుంటారు. రోజుకు ఖర్చులు పోనూ రూ.1300 వరకు వస్తుంది.

- రాజేశ్, తాటిముంజుల వ్యాపారి, నీలాద్రిపురం



సోమవారం ఎండ వేడిమికి నిర్మానుష్యంగా మారిన పాలకొల్లు బస్టాండ్ రోడ్డు

మండే..

40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత

ఉక్కపోతతో ప్రజలు విలవిల

పాలకొల్లు అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మృగశిర కార్తె ప్రవేశించి 4 రోజులైనా ఎండలు మండుతున్నాయి. సోమవారం భానుడు తన ప్రతాపాన్ని చూపించారు. 40 డిగ్రీల కన్నా అధికంగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు విలవిల్లాడిపోయారు. ఉదయం 10 గంటల నుంచి వేడిగాలులు వీయడంతో ప్రధాన రహదారులు అన్నీ నిర్మానుష్యంగా మారాయి. పాలకొల్లు మార్కెట్‌లో వ్యాపారులు 11 గంటలకు చాలామంది షాపులు మూసి వేసి ఇళ్ళకు వెళ్ళిపోయారు. వినియోగ దారులు లేక వ్యాపారాలు మందగించాయి. ప్రజలు ఇళ్లలోంచి బైటకు రావడానికి ఇబ్బందులు పడ్డారు. వడగాల్పులు వీయడంతో బాటసారులు శీతల పానీయాల షాపులకు ఎగబడ్డారు. సాయంత్రం 5 గంటలకు కొంత వేడి తగ్గడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

గృహనిర్మాణ సంస్థలో
పది మంది డీఈఈలకు పదోన్నతులు

అమరావతి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహనిర్మాణ సంస్థలో పది మంది డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు పదోన్నతులు లభించాయి. వారికి అందుబాటులో ఉన్న ఖాళీల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పోస్టింగులు ఇస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతులు పొందినవారిలో జి.పిచ్చయ్య (కందుకూరు డివిజన్, నెల్లూరు జిల్లా), పి.వెంకటరావు (మార్కాపురం డివిజన్, ప్రకాశంజిల్లా), కె.రమేష్‌రెడ్డి (మదనపల్లి డివిజన్, అన్నమయ్య జిల్లా), ఎన్.సుబ్రహ్మణ్యం (ప్రొద్దుటూరు డివిజన్,కడప జిల్లా), వై.లక్ష్మీనారాయణమ్మ (ధర్మవరం డివిజన్, శ్రీసత్యసాయి జిల్లా), బి.వెంకటరమణ (పెనుగొండ డివిజన్, సత్యసాయి జిల్లా), కె.సూరిబాబు (టెక్కలి డివిజన్, శ్రీకాకుళంజిల్లా), ఎం.రామోజీ నాయక్ (శ్రీకాకుళం డివిజన్, పార్వతీపురం మన్యం జిల్లా), కె.చంద్రశేఖర్ (పాలకొండ డివిజన్, పార్వతీపురం మన్యంజిల్లా), కేవీవీఎస్.ప్రసాద్ (జంగారెడ్డిగూడెం డివిజన్, ఏలూరు జిల్లా) ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలో ఏఎంసీ సెక్రటరీల బదిలీలు

ఏలూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ పరిధిలో పలు చోట్ల పనిచేస్తున్న వివిధ హోదాల్లోని సెక్రటరీలను బదిలీ చేస్తూ సోమవారం ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులిచ్చారు.

సెక్రటరీ	ప్రస్తుత స్థానం	బదిలీ ప్రాంతం
ఎంఎస్‌వీ ప్రభాకరావు	తాడేపల్లిగూడెం	భీమవరం
షేక్ గౌస్ భాషా	అత్తిలి	తాడేపల్లిగూడెం
ఎన్.శ్రీనివాసరావు	దుగ్గిరాల	కొవ్వూరు
ఎ.శారదా రాణి	ఏలూరు	విజయవాడ
జి.మంజుల	మచిలీపట్నం	ఏలూరు
బి.సౌజన్య	కైకలూరు	గుడివాడ
యు.యోగీశ్వరరావు	చిలకలూరి పేట	ఆకివీడు
జి.ప్రసన్న కుమారి	భీమవరం	పొన్నూరు
టీసీ. రామాంజనేయులు	పెనుగొండ	కావలి
సీహెచ్ సుబ్బారావు	ఆకివీడు	తెనాలి
డి.తిరుపతి రాయుడు	తణుకు	చిలకలూరిపేట
కె.ఆనంద్ (ఏడీఎం)	అవనిగడ్డ	ఉంగుటూరు
వి.మహేంద్రనాథ్(ఏడీఎం)	ఏలూరు	భీమడోలు
ఎంబీవీ శ్రీనివాసరావు (ఏడీఎం)	దెందులూరు	ఏలూరు(ఏడీఎం)

ఐసీడీఎస్‌లోనూ...

ఏలూరు జోన్ మహిళాశిశు, అభివృద్ధి సంస్థ పరిధిలో కృష్ణా, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల్లోని పలు కేడర్లలో పనిచేసే 153 మందిని సోమవారం బదిలీ చేశారు. అంగన్‌వాడీ గ్రేడ్-1 సూపర్‌వైజర్లు 46 మంది, గ్రేడ్-2 52 మంది, జూనియర్ అసిస్టెంట్లు 19 మంది, సీనియర్ అసిస్టెంట్లు 18 మంది, సబార్డినేట్లు 17 మంది, ఒక వార్డెన్ బదిలీ అయ్యారు.

క్రైం సమాచారం

వడదెబ్బకు ఉపాధి కూలీ మృతి


ఏడుకొండలు (ఫైల్)

పెదవేగి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా పెదవేగి మండలం అంకన్నగూడెం గ్రామానికి చెందిన అల్లూరి ఏడుకొండలు(53) వడదెబ్బ తగిలి సోమవారం మృతి చెందాడు. ఉదయం ఉపాధి పనికి వెళ్లిన అతడు కొద్దిసేపటికి ఎండ వేడికి తాళలేక అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. బాధితుడిని చికిత్స నిమిత్తం ఏలూరు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఆయనకు భార్య శారద, వివాహాలైన ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతి



దెందులూరు, జూన్ (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వ్యక్తి రోడ్డుపక్కన మృతి చెందిన ఘటన కొవ్వలి సమీపంలో జరిగింది. దెందులూరు మండల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దెందులూరు నుంచి కొవ్వలి గ్రామం వైపు వెళ్లే మార్గంలో కెనాల్ వద్ద గుర్తు తెలియని సుమారు 35 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతి చెంది పడి ఉన్నాడు. స్థానికులు గుర్తించి దెందులూరు పోలీసులకు సమాచారం ఇవ్వగా వచ్చి పరిశీలించి మృతి గల కారణాలను సేకరిస్తున్నారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్వర్టును ఢీకొని మోటారు సైక్లిస్టు..

కుక్కునూరు, జూన్9 (ఆంధ్రజ్యోతి): కుక్కునూరు గ్రామానికి చెందిన వాడపల్లి నాగశ్రీను(42) అనే వ్యక్తి రహదారి ప్రమాదంలో మృతి చెందాడు. ఆదివారం మధ్యాహ్న సమయంలో ద్విచక్రవాహనంపై కుక్కునూరు వస్తుండగా గ్రామ శివారుల్లో ప్రమాదవశాత్తు కల్వర్టును ఢీకొన్నాడు. ఈ క్రమంలో తీవ్రంగా గాయపడిన అతడిని కుక్కునూరు ప్రాథమిక ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేసి భద్రాచలం తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించిన క్రమంలో అక్కడ మృతి చెందాడు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఒకరి మృతి

కొయ్యలగూడెం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : కారు ఢీకొట్టిన ప్రమాదంలో మోటారు సైక్లిస్టు మృతి చెందిన ఘటన స్థానిక జంగారెడ్డిగూడెం వెళ్లే రహదారిలో నీలాలమ్మ ఆలయం వద్ద జరిగింది. ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలివి.. యర్రంపేట గ్రామానికి చెందిన రాపాక కల్యాణ్(26) జంగారెడ్డిగూడెం నుంచి స్వగ్రామం వస్తున్న సమయంలో ప్రమాద స్థలానికి వచ్చేసరికి కొయ్యలగూడెం వైపు జంగారెడ్డిగూడెం వెళ్తున్న కారు ఢీకొంది. అతడికి తీవ్ర గాయాలు కావడంతో జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

పెదపాడు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : పెదపాడు మండలం అప్పనవీడు పంచాయతీ తాళ్లమూడి వద్ద జాతీయరహదారిపై జరిగిన రోడ్డు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారని పెదపాడు పోలీసులు తెలిపారు. బొమ్మలూరుకు చెందిన నల్లూరి శ్రీనివాసరావు(45) వ్యవసాయ పనులు చేసి మోటారుసైకిల్‌పై వస్తుండగా వెనుక నుంచి వ్యాను ఢీకొంది. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు. మరో కేసులో బి.బ్రమేశ్వరరావు(29) తాళ్లమూడి జాతీయరహదారిపై మోటారుసైకిల్‌పై వెళ్తూ అదుపు తప్పి కిందపడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పెదపాడు ఎస్‌ఐ కట్టా శారదసతీష్ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

ఉంగుటూరు,జూన్ 9(ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు మండలం కైకరం వద్ద హైవేపై సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మంచినీళ్ల బాటిల్ కొనుగోలు చేసి రోడ్డు మీదకు వచ్చిన మోటారు సైకిల్‌ను తాడేపల్లిగూడెం నుంచి నందిగామ వెళుతున్న లారీ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో చేబ్రోలు నుంచి గుండుగొలనుకు బైక్‌పై వెళుతున్న గుండుగొలనుకు చెందిన ఎన్.సురేష్‌కు కుడిచేయి విరిగింది. జి.ప్రేమ్‌చంద్‌కు ఎడమ మోకాలుకు తీవ్ర గాయమైంది. వీరిద్దరిని హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.




ఏలూరు సాక్షి కార్యాలయం వద్ద గన్ని, బడేటి చంటి, మహిళల ఆందోళన.. తణుకు నరేంద్ర సెంటర్‌లో సాక్షి ప్రతులను దహనం చేస్తున్న మహిళలు.. నూజివీడు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న ఎన్డీయే నాయకులు

క్షమాపణ చెప్పాల్సిందే..

- సాక్షి పేపర్, చానల్‌పై నిషేధం విధించాలని ఉమ్మడి పశ్చిమ జిల్లాలో నిరసనల వెల్లువ
- సాక్షి ప్రతుల దహనం

అసత్యపు ప్రచారాలతో సమాజంలో దుష్ట సంప్రదాయాన్ని ప్రోత్సహిస్తున్న సాక్షి పేపర్, చానల్‌పై నిషేధం విధించాలని సోమవారం ఉమ్మడి పశ్చిమ జిల్లా వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. అమరావతి ప్రాంత మహిళలను అవమానకరంగా మాట్లాడిన కృష్ణంరాజును, కొమ్మినేని శ్రీనివాసరావును కఠినంగా శిక్షించాలని పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదులు చేశారు. వీటిని ప్రోత్సహిస్తున్న సాక్షి యాజమాన్యం వైఎస్.భారతిరెడ్డి, వైఎస్.జగన్ మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సాక్షి ప్రతులను దహనం చేశారు.

పేపర్, చానల్‌పై నిషేదం విధించాలి : గన్ని, చంటి

ఏలూరుటూటౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిపై విషపు ప్రచారం చేస్తున్న సాక్షి పేపర్, చానల్‌పై నిషేధం విధించాలని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యే బడేటి చంటి డిమాండ్ చేశారు. అమరావతి మహిళలను కించపరిచినందుకు ఏలూరు సాక్షి కార్యాలయం వద్ద సోమవారం టీడీపీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ అమరావతి ప్రాంత మహిళలను అవమానకరంగా మాట్లాడిన కృష్ణంరాజును అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అరెస్టు చేసిన కొమ్మినేని శ్రీనివాసరావును కఠినంగా శిక్షించాల న్నారు. ఇటువంటి వ్యక్తులను ప్రోత్సహిస్తున్న సాక్షి యాజమాన్యం వైఎస్.భారతిరెడ్డి, వైఎస్.జగన్ మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తొలుత టీడీపీ మహిళా ఆధ్వర్యంలో ర్యాలీగా సాక్షి కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. డిప్యూటీ మేయర్ వందనాల దుర్గాభవాని, టీడీపీ పట్టణ అధ్యక్షురాలు తవ్వా అరుణకుమారి, అధికార ప్రతినిధి కడియాల విజయలక్ష్మి, కార్పోరేటర్ తంగిరాల అరుణ, టీడీపీ మహిళానేతలు పాల్గొన్నారు.

తణుకులో సాక్షి ప్రతుల దహనం


తణుకు : అమరావతి ప్రాంత మహిళలను ఉద్దేశించి అవమానకర వ్యాఖ్యలు చేసిన వైసీపీ పేటీఎం జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నియోజకవర్గ తెలుగు మహిళలు నిరసన ధర్నా చేపట్టారు. సోమవారం పెద్దఎత్తున మహిళలు నరేంద్ర సెంటర్‌లో జరిగిన ధర్నాలో పాల్గొన్నారు. సాక్షి పత్రికలను దహనం చేశారు. సాక్షి, జర్నలిస్టులకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్‌వర్మకు వినతి పత్రం అందజేశారు.

నూజివీడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

నూజివీడు టౌన్ : సాక్షి టీవీ డిబేట్‌లో అమరావతి మహిళలను కించపరిచేలా మాట్లాడిన జర్నలిస్టులపై చర్యలు తీసుకోవాలని నూజివీడు రూరల్ మండల ఎన్డీయే నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నూజివీడు నియోజకవర్గ బీజేపీ నాయకులు గోగినేని శ్రీనివాస కుమార అప్పారావు, వైయస్ దొరై తదితరుల ఆధ్వర్యంలో నూజివీడు రూరల్ పోలీసుస్టేషన్లో ఈ మేరకు ఫిర్యాదు చేశారు. టీడీపీ నాయకులు గోగినేని మధు, మున్సిపల్ కౌన్సిలర్ పాదం సత్యనారాయణ పాల్గొన్నారు.

చానల్ లైసెన్సు రద్దు చేయాలి

- ఆచంట ఎమ్మెల్యే పితాని



పెనుమంట్ర : ఆంధ్రుల రాజధాని అమరావతిపై అసభ్య పదజాలంతో మాట్లాడిన సాక్షి చానల్ ప్రతినిధులపై క్రిమినల్ కేసులో నమోదు చేసి, ప్రసారం చేసిన చానల్ లైసెన్సు రద్దు చేయాలని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ డిమాండ్ చేశారు. పెనుమంట్ర మండలం ఎస్.ఐ.పర్రు, మల్లిపూడిలో 'పల్లెపల్లెకు మన పితాని ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి తల్లిని ఆస్తి కోసం కోర్టు చుట్టూ తిప్పుతూ, చెల్లిని ఇంటి నుంచి పంపించేసి వెన్నుపోటు పొడిచావని గుర్తు చేశారు. అసలు సిసలైన వెన్నుపోటు దారుడు జగన్మోహన్‌రెడ్డి అని గుర్తు చేశారు. అబద్ధపు ప్రచారం చేస్తూ అమరావతిపై జగన్ మీడియా విషం కక్కుతుందని ఆరోపించారు. తక్షణమే సాక్షి మీడియా ప్రసారాలను నిలుపుదల చేయాలని రాజధానిపై విష ప్రచారాన్ని చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రోజా రమణి

రాజధాని ఇమేజ్‌ని డ్యామేజ్ చేయాలని కుట్ర

పాలకొల్లు అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి బ్రాండ్ ఇమేజ్‌ను డ్యామేజ్ చేయాలన్నదే వైసీపీ వర్గాల ఆలోచన అని, దీనిలో భాగంగా గతంలో ఎన్నో కుతంతాలు చేసి 2019లో అధికారంలోకి వచ్చి ఐదేళ్లపాటు అమరావతి రాజధాని కాకుండా ప్రయత్నించారని తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కర్నేన రోజారమణి అన్నారు. సోమవారం తన నివాసంలో ఆమె మాట్లాడుతూ అనేక విధాలుగా రాష్ట్రాన్ని నాశనం చేసిన వైసీపీ మూకలు నేడు చరిత్ర కలిగిన రాజధానిలో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని అన్నారు. జరిలిస్టుల ముసుగులో డ్రామాలు ఆడిన వారు ఎంతటి వారైనా చట్టప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆమెతో పాటు భర్త, తెలుగు దేశం పార్టీ బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు కర్నేన గౌరునాయుడు తదితరులు ఉన్నారు.

మహిళలను కించపరిచే వ్యాఖ్యలు శోచనీయం


విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఏలూరు రూరల్ : రాజధాని అమరావతి మహిళలను వేశ్యలంటూ అగౌరవపర్చిన జర్నలిస్టులు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావులపై సుమోటోగా కేసులు నమోదు చేయాలని ఏలూరు జిల్లా బీజేపీ అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్ కిశోర్ డిమాండ్ చేశారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అడపా శోభారాణితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి సాక్షి చానల్‌లో నీతిమాలిన మాటలు మాట్లాడిస్తున్నారని ఆరోపించారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు శోభారాణి మాట్లాడుతూ మహిళలపై జర్నలిస్టు కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలు క్షమించరాని నేరమన్నారు. ఏఎంసీ వైస్ చైర్మన్ వాణి భాస్కర్, అసెంబ్లీ కన్వీనర్ గాది రాంబాబు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కాట్రు విజయ్, నెక్కంటి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అమరావతిపై విషం కక్కుతోంది : రాధాదేవి



పెనుమంట్ర : అమరావతి రాజధానిపై సాక్షి మీడియా విషం కక్కుతోందని తెలుగుదేశం పార్టీ పెనుమంట్ర మండల టీడీపీ మహిళ అధ్యక్షురాలు భూపతిరాజు రాధాదేవి ఆరోపించారు. పెనుమంట్రలో ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ టీవీ ఇంటర్వ్యూలో జర్నలిస్ట్ కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాస్ అమరావతి మహిళలపై చేసిన అనుచితవ్యాఖ్యలను ఖండించారు. వేశ్యల రాజధానిగా వర్ణించడం మహిళలను అవమానించడమేనని, తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. టెలివిజన్ ప్రసారాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్జీటీ బదిలీలకు మాన్యువల్
కౌన్సెలింగ్ ఓకే!



- కంపల్సరీ, స్పౌజ్ కేటగిరీ ఎస్జీటీల ఆందోళనకు తెర
- ఇప్పటికే వెబ్‌ఆప్షన్లతో కోరుకున్న స్థానాల్లో చేరిన 2,257మంది స్కూల్ అసిస్టెంట్లు

ఏలూరు అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి):వెబ్ కౌన్సెలింగ్‌పై సెకండరీగ్రేడ్ టీచర్ల(ఎస్జీటీ) అపోహలు, సందేహాలు, ఆందోళనలకు తెరవేస్తూ వారికి మాన్యువల్ పద్ధతిలోనే బదిలీల కౌన్సెలింగ్‌ను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ తన అధికారిక ట్విటర్‌ద్వారా సోమవారం రాత్రి సమాచారం ఇచ్చారు. ఆ ప్రకారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా 48 మండలాల పరిధిలో సాధారణ బదిలీలకు దరఖాస్తు చేసుకున్న 2,862 మంది ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ విధానంలోనే అందుబాటులో వున్న వెకెన్సీలకు బదిలీ కోరుకునేందుకు వారి సమక్షంలోనే ప్రత్యక్షంగా అభీష్టాలను స్వీకరించి అక్కడికక్కడే నూతన స్థానాలను కేటాయిస్తారు. కాగా మాన్యువల్ కౌన్సెలింగ్ షెడ్యూలును విద్యాశాఖ విడుదల చేయాల్సిఉంది. ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఏలూరు జడ్పీ మీటింగ్ హాలును కౌన్సెలింగ్ వేదికగా ఖరారు చేసే అవకాశముంది. ఇక్కడి మీటింగ్ హాలులో 300 మంది కూర్చునేలా సీటింగ్ ఎరేంజ్‌మెంట్స్ ఉండడంతో దీనినే ఖరారుచేస్తారని భావిస్తున్నారు. ఇది కుదరకపోతే సీఆర్‌ఆర్ కళాశాల ఆడిటోరియంను పరిశీలించే అవకాశముంది. తమకు వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ వద్దని, మాన్యువల్ కౌన్సెలింగ్ ఒక్కటే తమకు న్యాయంచేస్తుందని కొద్దిరోజులుగా ఎస్జీటీలు, వారికి మద్దతుగా ఉపాధ్యాయసంఘాల ఐక్యవేదిక ఆందోళన చేస్తోన్న విషయం విదితమే. ప్రభుత్వం ఇటీవల ఇచ్చిన హామీమేరకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాల్సిందేనని పట్టుబడుతూ ఉమ్మడి జిల్లా కేంద్రంలో డీఈవో కార్యాలయంవద్ద ఆది, సోమవారాల్లో రోడ్డుపై బైఠాయింపు, నిరాహార దీక్షలు నిర్వహించారు. అదే సమయంలో సోమవారం నుంచే ఎస్జీటీలకు స్లాట్ పద్ధతిన వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకునే ప్రక్రియను విద్యాశాఖ ప్రారంభించింది. ఈక్రమంలో తొలుత గవర్నమెంటు యాజమాన్యం, ఉర్దూ పాఠశాలలనుంచి బదిలీకి దరఖాస్తు చేసుకుని, వెబ్‌ఆప్షన్లు ఇచ్చిన ఎస్జీటీలకు సోమవారం మధ్యాహ్నంనుంచి ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ల జారీ మొదలైంది.

మరోవైపు జడ్పీ, ఎంపీపీ, మునిసిపల్ యాజమాన్యాల ఎస్జీటీల నుంచి కూడా వెబ్‌ఆప్షన్లు ప్రారంభంకాగా, ఆప్షన్లు నమోదు చేసిన ఉపాధ్యాయుల సంఖ్య ఆశావహంగానే ఉండడంతో మిగతా ఉపాధ్యాయులు పునరాలోచనలో వున్న సమయంలో సోమవారం రాత్రి హఠాత్తుగా మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్ణయాన్ని విద్యాశాఖ మంత్రి ప్రకటించారు. ఈ నేపథ్యంలో సోమవారం తొలి స్లాట్‌లో ఉమ్మడి జిల్లా నుంచి వెబ్ ఆప్షన్లు నమోదు చేసిన స్థానిక సంస్థల ఎస్జీటీల్లో ఎవరికీ నూతన బదిలీ స్థానాలకు ఆర్డర్లు జారీకాకపోవడం, తాజాగా మాన్యువల్ కౌన్సెలింగ్‌కు ప్రభుత్వం మొగ్గుచూపడంతో వెబ్ ఆప్షన్లన్నీ ఆటోమేటిక్‌గా రద్దయినట్టేనని సమాచారం. దీనిపై అధికారిక స్పష్టత రావాల్సిఉంది. ఆ మేరకు వెబ్ ఆప్షన్ల పద్ధతిన తొలి స్లాట్‌లో ఆయా వెకెన్సీలకు తమ అభీష్టాలను నమోదుచేసిన ఎస్జీటీల సంఖ్యలో సోమవారం సాయంత్రం ఆరు గంటల సమయానికి కంపల్సరీ కేటగిరీలో 36.41శాతం, రిక్వెస్టు కేటగిరీలో 44.12శాతం పూర్తికావడం సంతృప్తికర సానుకూలతకు సంకేతంగా భావిస్తున్నారు. హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ కేడర్ల ఉపాధ్యాయుల బదిలీలకు నిర్వహించిన వెబ్‌ఆధారిత కౌన్సెలింగ్ ఇప్పటికే విజయవంతంగా ముగిసిన విషయం విదితమే.

నేడు ముట్టడి ఉపసంహరణ

నేడు విద్యాభవన్ ముట్టడి ఆందోళన కార్యక్రమాన్ని ఉపసంహరించుకున్నామని ఐక్యవేదిక జిల్లా నాయకుడు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.ఆంజనేయులు తెలిపారు. ఎస్జీటీలకు మాన్యువల్ బదిలీ కౌన్సెలింగ్‌ను చేపట్టాల్సిందేనంటూ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించే మంగళగిరిలోని విద్యాభవన్ ముట్టడి కార్యక్రమాన్ని ప్రభుత్వ నిర్ణయంతో ఉపసంహరించుకున్నామన్నారు.

2,862 మందికి 1,179 మంది తప్పనిసరి

ఉమ్మడి జిల్లాలో మొత్తం 2,862 మంది ఎస్జీటీలు బదిలీకి దరఖాస్తు చేసుకోగా, వీరిలో జడ్పీ/ఎంపీపీ/మున్సిపల్ యాజమాన్యాలకు చెందిన ఎస్జీటీలు 2,226 మంది ఉన్నారు. వీరిలో 1,179మందికి బదిలీ తప్పనిసరి. మిగతావారివి రిక్వెస్టు బదిలీకోసం సమర్పించిన దరఖాస్తులు. కాగా ఉమ్మడి జిల్లాలోని పురపాలక సంఘాల యాజమాన్య పాఠశాలలనుంచి 183మంది ఎస్జీటీలు బదిలీకి దరఖాస్తుచేసుకోగా, వీరిలో సోమవారం సాయంత్రానికి 163మంది వెబ్‌ఆప్షన్లు ఇచ్చారని తెలిపాయి. ఇక ఏలూరు మునిసిపల్ కార్పొరేషన్ యాజమాన్య పాఠశాలల్లో మాత్రం 144మంది ఎస్జీటీలు బదిలీకి దరఖాస్తు చేసుకోగా, వీరిలో సోమవారం సాయంత్రానికి ఆరుగురు మాత్రమే వెబ్ ఆప్షన్లు ఇవ్వడం గమనార్హం. తాజా పరిణామాలతో ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్‌ను పూర్తిచేయాలంటే రోజుకు సగటున గరిష్ఠంగా 400మందికి మాత్రమే కౌన్సెలింగ్ నిర్వహించడం సాధ్యమవుతుందని విద్యాశాఖవర్గాలు వెల్లడించాయి.

వెబ్ ఆప్షన్లు సక్సెస్.. విధులు స్కూల్ అసిస్టెంట్లు !

ఉమ్మడిజిల్లావ్యాప్తంగా టీచర్ల సాధారణ బదిలీల ప్రక్రియలో ఇప్పటివరకు జరిగిన గ్రేడ్-2 హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్ కేడర్ అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయులు నూతన బదిలీస్థానాలకు అభీష్టాలను ఇచ్చేందుకు వెబ్ ఆప్షన్ల పద్ధతినే అనుసరించగా అందరికీ సానుకూలమైన స్థానాలే ఖరారయ్యాయని సంతృప్తివ్యక్తమవడం గమనార్హం.

ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో 125మంది గ్రేడ్-2 హెచ్‌ఎంలు, 2,257మంది స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్లు వెబ్ ఆప్షన్ల పద్ధతిలోనే బదిలీస్థానాలను ఎంచుకోగా, వారందరికీ కొత్త పాఠశాలలకు నియామక ఆర్డర్లు జారీకావడం, కోరుకున్న స్థానాల్లో సోమవారం విధుల్లో చేరిపోవడం చకచకా జరిగిపోయాయి. ఇక మిగిలింది ఎస్జీటీలు మాత్రమే. ఉమ్మడి జిల్లాలో అన్ని ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల్లో మొత్తం 2,862మంది ఎస్జీటీలు బదిలీకి దరఖాస్తుచేసుకున్నారు. వీరిలో 1,475మంది తప్పనిసరి బదిలీ జాబితాలో ఉండగా, మిగతా వారంతా రిక్వెస్టు బదిలీకి దరఖాస్తుచేసుకున్నవారే. ఇపుడు ఎస్జీటీలందరికీ మాన్యువల్ కౌన్సెలింగ్‌ను నిర్వహించడానికి జిల్లాలో కనీసం ఐదు లేదా ఆరురోజుల వ్యవధి పడుతుందని చెబుతున్నారు. మరోవైపు వేసవి సెలవుల అనంతరం పాఠశాలలన్నీ ఈనెల 12న పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో ఎస్జీటీల బదిలీల కౌన్సెలింగ్ ఎప్పటికి పూర్తవుతుందో విద్యాశాఖవైపునుంచి స్పష్టత రావాల్సిఉంది.


మాట్లాడుతున్న ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్ సాయిశ్రీనివాస్

ఉపాధ్యాయ సంఘాల
నిరాహార దీక్ష

ఏలూరు అర్బన్: మెజార్టీ సంఖ్యలో ఉపాధ్యాయులు మాన్యువల్ కౌన్సెలింగ్‌కే మద్దతు తెలియజేస్తున్నందున ప్రభుత్వం దిగివచ్చి ఆ పద్ధతిలోనే నిర్వహించేందుకు ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్ ఎల్.సాయిశ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎస్జీటీలకు మాన్యువల్ పద్ధతిలోనే కౌన్సెలింగ్ చేపట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక డీఈవో కార్యాలయం వద్ద ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన నిరాహారదీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు రవికుమార్, ముస్తఫాఅలీ, విజయరామరాజు, మోహన్, రమణ, నారాయణ, సాంబశివరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల బదిలీలు ముగిశాయి

ఏలూరుసిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల పర్వం ముగిసింది. జిల్లాలో ఒకే కార్యాలయంలో ఐదేళ్ల సర్వీసు దాటిన వారిని తప్పనిసరిగా బదిలీ చేయాలని, జీరో సర్వీసు ఉన్నా వారి వినతి మేరకు బదిలీలు చేయాలని, పరిపాలనా పరంగా బదిలీలు చేయవచ్చని బదిలీల ప్రక్రియను గతనెలలో ప్రారంభించారు. తొలుత ఈ బదిలీల ప్రక్రియను గతనెల 30వ తేదీకే పూర్తి చేసి ఈనెల రెండో తేదీ నాటికి పూర్తిస్థాయిలో బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ బదిలీల ప్రక్రియను వారంరోజుల పాటు ప్రభుత్వం వాయిదా వేసింది. దీంతో ఈనెల 9వ తేదీ నాటికే ఈ బదిలీల ప్రక్రియ పూర్తిచేయాలని నిర్ణయించారు. సంబంధిత ఉద్యోగుల బదిలీల ప్రక్రియను పూర్తి చేశారు.

పంచాయతీల ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పంచాయతీ కార్యదర్శుల బదిలీ ప్రక్రియను జిల్లా పంచాయతీ అధికారి వారి కార్యాలయంలో నిర్వహించారు. ఏలూరులోని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉద్యోగుల బదిలీల కౌన్సిలింగ్ సోమవారం నిర్వహించారు.



డీపీవో కార్యాలయంలో బదిలీలు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి ఏలూరు జిల్లా పంచాయతీ కార్యాలయంలో ఈ బదిలీల ప్రక్రియ జిల్లా పంచాయతీ అధికారి కొడాలి అనూరాధ నిర్వహించారు పలు గ్రేడ్‌ల వారీగా పంచాయతీ కార్యదర్శులకు సంబంధించి 320 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్-1కు సంబంధించి 17 మంది, గ్రేడ్-2కు సంబంధించి ఆరుగురు, గ్రేడ్-3కి సంబంధించి ఒక్కరు, గ్రేడ్-4కు సంబంధించి నలుగురు, గ్రేడ్-5కు సంబంధించి 292 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికీ బదిలీల ప్రక్రియ పూర్తి చేశారు.

జడ్పీ కార్యాలయంలో..

ఏలూరులోని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ ఉద్యోగులకు సంబంధించి బదిలీల ప్రక్రియ నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ నేతృత్వంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ సీఈవో కె.భీమేశ్వర్ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ నిర్వహించారు. బదిలీల కోసం వచ్చిన దరఖాస్తులకు అనుగుణంగా జిల్లా పరిషత్‌కు సంబంధించి ఎండీవోలు ఇద్దరు, ఏవోలు తొమ్మిది మంది, సీనియర్ అసిస్టెంట్లు 19మంది, జూనియర్ అసిస్టెంట్లు 31 మంది, టైపిస్టులు ఐదుగురు, రికార్డ్ అసిస్టెంట్లు 30మంది, ల్యాబ్ అండ్ లైబ్రరీ అసిస్టెంట్లు 12మంది, ఆఫీస్ సబార్డినేట్స్ ఐదుగురు కలిపి మొత్తం 111 మందిని బదిలీ చేశారు.

వైభవంగా కొర్రాజులు పెద్దమ్మ జాతర

జీలుగుమిల్లి, జూన్: 9(ఆంధ్రజ్యోతి): ములగలంపల్లిలో కొర్రాజులు పెద్దమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. మూడేళ్లకోసారి నిర్వహించే ఇ జాతరలో గిరిజనులు సాంప్రదాయం ప్రకారం మేళ తాళాలతో అమ్మవారి పెళ్లి జరిపిస్తారు. అమ్మవారితో నిప్పులగుండం ప్రవేశం చేస్తారు. నిప్పుల గుండం ఏర్పాటు ముందురోజు శిరిమాను చెట్లకు పూజ చేసి వనమహోత్సవం జరుపుతారు. గిరిజన పెద్దలు మాజీ సర్పంచ్ బేతి దుర్గారావు, జిన్నె వెంకటేశ్వరరావు, పోతురాజు, సోమరాజు, గోపిన రాము, జిన్నె వెంకన్నబాబు ఉన్నారు.

భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ఉన్నతాధికారులు

ఉంగుటూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు భద్రకాళి అమ్మవారిని సోమవారం డీఎస్పీ శ్రావణ్ కుమార్ దంపతులు, విద్యుత్తు శాఖ ఏ.డి.ఈ.వసుమర్తి వేణు ప్రసాద్ దంపతుల కుటుంబాలు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహక కమిటీ తరపున పాతూరి వంశీ కృష్ణ, పాతూరి విజయకుమార్ రత్నాష దంపతులు వీరికి స్వాగతం పలికి అమ్మవారి శేష వస్త్రాన్ని, ప్రసాదాన్ని అందించి ఆశీర్వదించారు.

పశుపాలనలో శాస్త్రీయ విధానంపై అవగాహన

ఉంగుటూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తే పశుపాలనలో లాభదాయకతను పెంచుకోవచ్చని సీనియర్ పశు శాస్త్రవేత్త కె.నాగరాజ కుమారి అన్నారు. వికసిత్ అభియాన్‌లో భాగంగా సోమవారం నాచుగుంట రైతు సేవా కేంద్రంలో వెంకటేశ్వర వెటర్నరీ విశ్వ విద్యాలయం గేదెల పరిశోధనా సంస్థ సీనియర్ శాస్త్రవేత్త కె.నాగరాజకుమారి పలు అంశాలకు సంబంధించి రైతులకు సలహాలందించారు. ప్రేమలత, ఉంగుటూరు మండల వ్యవసాయాధికారి ప్రవీణ్, ప్రసాదరెడ్డి, కె.వి.కె. శాస్త్రవేత్తలు సమన్వయం చేశారు.

నారాయణపురంలో ముందస్తు ఖరీఫ్‌పై సమీక్ష..

ద్వారకాతిరుమల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రైతులు కృషి విజ్ఞానకేంద్ర సేవలను వినియోగించుకోవాలని కేవీకే విస్తరణాధికారి వి.దీప్తి కోరారు. నారాయణపురంలో సోమవారం వికసిత కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా ముందస్తు ఖరీఫ్‌పై సమీక్ష జరిగింది. ఆయిల్ పాంలో కోకోను అంతరపంటగా సాగు చేసే విధానాన్ని సమగ్ర ఎరువుల యాజమాన్యాన్ని వివరించారు. అనంతరం ఆయిల్ పాం పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త రామచంద్రుడు రైతులతో ముఖాముఖి నిర్వహించి సందేహాలను నివృత్తిచేశారు. ఏవో ఎ.దుర్గారమేశ్, నిహారిక పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ఏలూరు రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): సేవా దృక్పథంతో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడింగ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు అభినందించారు. సోమవారం హేలాపురి ప్రైవేటు ఎక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్, ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడింగ్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏడు గోలీల సెంటర్లో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గౌరవ సలహాదారులు షైచర్ల శంకరరావు, ఆర్గనైజర్ సెక్రటరీ ఉమాసాయి, జాయింట్ సెక్రటరీ కాకర్ల సహదేవుడు, కోశాధికారి పిట్ట సాయి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వెంకటరెడ్డి మరణంపై విచారణ జరపాలి : కేవీపీఎస్

బుట్టాయగూడెం, జూన్ 9(ఆంధ్రజ్యోతి):లక్ష్మీపురం-రెడ్డిగూడెం గ్రామాల మధ్య గతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కోపల వెంకటరెడ్డి మృతిపై సమగ్ర విచారణ జరపాలంటూ సోమవారం మృతుడి భార్య కోపల అమ్మాజీ, కేవీపీఎస్, దళిత సంఘాల నాయకులు తహసీల్దార్ పి.వి.చలపతిరావుకు వినతి పత్రం అందజేశారు. బాధితురాలు అమ్మాజీ, నాయకులు అందుగుల ఫ్రాన్సిస్, ఏసుపాదం, కుటుంబరావు మాట్లాడుతూ లక్ష్మీపురం సమీపంలో మోటారు సైకిల్‌పై ఆగి ఉండగా వెనుక నుంచి వచ్చిన అధికార పార్టీకి చెందిన వ్యక్తి కారు ఢీకొట్టడంతో మృతి చెందాడని, దీనిని ప్రమాదంగా చిత్రీకరించి 108లో మృతదేహాన్ని జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారన్నారు. నియోజకవర్గ నాయకుడి సాయంతో పోస్టుమార్టం తర్వాత భౌతికకాయాన్ని గిరిజన కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. వెంకటరెడ్డి మరణంపై సమగ్ర విచారణ జరిపి అధికారులను తప్పుదోవపట్టించి దళితుడిని కేసులో ఇరికించిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

పెదవేగి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ.34.58 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ లబ్ధిదారులకు అందజేశారు. సరైన వైద్యం చేయించుకోలేని దుస్థితిలో బాధపడుతున్న వారికి సీఎం సహాయనిధి వరం లాంటిదని అన్నారు. పార్టీ నాయకులు ఈడ్పుగంటి అనిల్ కుమార్, కొనకళ్ల శివమణి, మంచినేని శ్రీనివాసరావు, పామర్తి నాగభూషణం, మేకా కనకరాజు, కూచిపూడి పుల్లారావు, తలకొండ జమలయ్య, మందలపు సుబ్బారావు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు సౌకర్యాల కల్పన

ఏలూరు క్రైం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డిపో పరిధిలోని బస్టాండ్‌ల్లో ప్రయాణికుల సౌకర్యార్థం అనేక చర్యలు చేపట్టామని ఆర్టీసీ డిపో మేనేజర్ వాణి తెలిపారు. ఏలూరు కొత్త బస్టాండ్‌ను ప్రయాణికుల సౌకర్యార్థం ప్రతి రోజు 300 లీటర్ల తాగునీరు, బస్టాండ్ ప్రాంతంలో రాత్రిపూట ప్రయాణికుల సౌకర్యార్థం ముఖ ద్వారం వద్ద, బస్టాండ్ లోపల ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేశామన్నారు. తక్కువ విద్యుత్ వినియోగించే బీఎల్‌డీసీ ఫ్యాన్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ వారు సామాజిక బాధ్యతలో భాగంగా మొదటి విడతగా పంపిణీ చేసిన ఫ్యాన్లను బస్టాండ్‌లో ఏర్పాటు చేశామన్నారు. వీటివల్ల ప్రయాణికులకు సౌకర్యంతో పాటు విద్యుత్ వినియోగం తగ్గి పరోక్షంగా పర్యావరణ పరిరక్షణలో పాలు పంచుకోవడం అవుతుందని డిపో మేనేజర్ తెలిపారు.

శ్రీవారిసేవలో కేజీఎఫ్ విలన్ గరుడ



ద్వారకాతిరుమల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయాన్ని సినీ నటుడు రామచంద్రరాజు(గరుడ), అతని భార్య సుమ, సినీ దర్శకుడు సాయి శివన్ సందర్శించారు. ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేకపూజలు జరుపుకున్నారు. అనంతరం వారు అభిమానులతో కాసేపు సందడి చేశారు. రామచంద్రరాజు మాట్లాడుతూ తాను కేజీఎఫ్, వైరం సినిమాల్లో విలన్‌గా నటించానన్నారు. పూరిజగన్నాథ్ సోదరుడు సాయిరామ్ శంకర్‌తో కలిసి ఇంటికో సైకో చిత్రాన్ని చేస్తున్నట్టు దర్శకుడు సాయిశివన్ తెలిపారు.

ఓ ఇంటిని దోచేసిన దొంగకు 14 రోజుల రిమాండ్

ఏలూరు క్రైం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఒక ఇంటి తాళాలు పగులగొట్టి బంగారం, వెండి, నగదు అపహరించిన దొంగను రూరల్ ఎస్ఐ సి.హెచ్.కె.దుర్గా ప్రసాద్ సోమవారం అరెస్టు చేశారు. గత నెల 26న ఏలూరు బీడీ కాలనీకి చెందిన వ్యక్తి తన కుటుంబ సభ్యులతో రాజమహేంద్రవరం వెళ్లాడు. పెదపాడుకు చెందిన పాత నేరస్థుడు సత్తెనపల్లి రాకేశ్ ఇంటి తాళాలు పగులగొట్టి 13 లక్షల రూపాయల విలువైన వెండి, బంగారం వస్తువులు, నగదును అపహరించుకుపోయాడు. రాకేష్‌ను సోమవారం అరెస్టు చేశారు. కోర్టుకు హాజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించారు. దీంతో జిల్లా జైలుకు తరలించారు.

కొల్లేరు సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి

(5వ పేజీ తరువాయి)

ఒక జిరాయితీ, డీఫామ్ పట్టాలను మాత్రమే మనం కాంటూరు నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని దీని సాధనకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎంపీలు పుట్టా మహేశ్‌కుమార్, పాకా వెంకట సత్యనారాయణ, ఐదు నియోజ కవర్గాల ఎమ్మెల్యేలు కృషి చేస్తున్నామన్నారు. గ్రామాల వారీగా వివరాలను అందరూ సేకరించి త్వరితగతిన అప్పగించాలని సూచించారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ సీఈసీ కమిటీ వచ్చిన సమయంలో ప్రజలంతా మౌలిక సదుపాయాలను అడగాలని, కమిటీ స్పందించేలా నడుచుకోవాలన్నారు. అందరూ కలిసికట్టుగా గ్రామసభల ద్వారా తీర్మానం చేసి అందించాలన్నారు. కొల్లేరు సరస్సులో వాస్తవ సంఘటనలు, వాజ్యాల పత్రాల సంకలనంతో పెదనింద్రకొలను గ్రామానికి చెందిన మాచవరపు నాగ సత్యగంగాధరం తయారుచేసిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. చేపలరైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నంబూరి వెంకట రామరాజు, నంబూరి శివాజీరాజు, ఘంటసాల వెంకటలక్ష్మి, కమ్మిలి విఠలరావు, కన్వీనర్ బలే ఏసురాజు, సైదు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్.. షాక్..

(5వ పేజీ తరువాయి)

పరిశ్రమలు, వ్యాపారులకు పెట్టుబడి భారమవుతుంది. చిన్న పరిశ్రమల నిర్వహణకు ఇది మరో గుదిబండ.

సమాచారం ఉండదు : ప్రస్తుతం విద్యుత్ బిల్లులో వాడిన యూనిట్లు, చెల్లించాల్సిన ధర, కస్టమర్ చార్జీల వివరాలు స్పష్టంగా ఉంటాయి. ప్రిపెయిడ్ విధానంలో యూనిట్‌కు ఎంత వసూలు చేస్తున్నారనే వివరాలు నేరుగా లభ్యమయ్యే పరిస్థితులు ఉండవని పలువురు చెబుతున్నారు.

మున్ముందు భారమే : జి.రాజు, సీపీఎం నాయకుడు



ఇప్పటికే స్మార్ట్ మీటర్లు పెట్టినవారికి బిల్లులు మామూలుగానే వస్తున్నాయి కదా అన్న ప్రశ్న ఉదయించవచ్చు. ఇంకా అందరికీ స్మార్ట్‌మీటర్లు బిగింపు కార్యక్రమం పూర్తికాలేదు. అందరికీ ఈ మీటర్లు బిగింపు పూర్తయిన తరువాత ఈ మీటర్ల అసలు పని ప్రారంభమవుతుంది. కేంద్రం ప్రభుత్వం ఆదేశాలతో ఈకార్యక్రమం జరుగుతుంది. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానానికి పూర్తిగా వ్యతిరేకించింది. మా రాష్ట్రంలో అమలు చేయమని స్పష్టంగా కేంద్రానికి తెలిపింది. కేరళ ప్రభుత్వ కూడా ఈ మీటర్ల బిగింపుకు వ్యతిరేకించింది. మన రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈవిషయంపై పునరాలోచించి ఇచ్చిన వాగ్ధానాన్ని నిలుపుకొని ప్రజాపక్షం అని నిరూపించుకోవాలి.



జీలుగుమిల్లిలోని ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలరాజు



టి.నరసాపురంలో ర్యాలీలో పాల్గొన్న అధికారులు



లింగపాలెంలో మానవహారంలో పాల్గొన్న అధికారులు

ఉత్సాహంగా యోగాంధ్ర ర్యాలీలు

చింతలపూడి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): యోగాంధ్రను పురస్కరించుకుని చింతలపూడి నగర పంచాయతీలో ఫైర్‌స్టేషన్ సెంటర్ నుంచి బోసుబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. మునిసిపల్ కమిషనర్ అంబటి రాంబాబు మాట్లాడుతూ యోగా వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ర్యాలీలో నాయకులు జె.ముత్తారెడ్డి, చీదరాల మధుబాబు, తాటి అప్పారావు, బోడా నాగభూషణం, కె.శేషగిరిరావు, ధర్మరాజు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్ కె.వి.రమణ ఆధ్వర్యంలో సోమవారం యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవి.రమణ హాజరై ర్యాలీలో పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయం నుంచి బోసుబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో తహసీల్దార్ కె.స్లీవ జోజి, టీడీపీ పట్టణాధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్, సీనియర్ నాయకులు రావూరి కృష్ణ, పరిమి సత్తిపండు, బూరుగుపల్లి సూరిబాబు, బీజేపీ బ్రహ్మాజీ పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ఎంపీడీవో పీవీవీ ప్రకాశ్ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో తహసీల్దారు జె.వి.సుబ్బారావు, జడ్పీటీసీ శామ్యూల్, ఎంఈవో పరసా వెంకట్రావు, కార్యదర్శి జిటి శ్రీనివాస్, సూపరింటెండెంట్ వెంకట్రావు, ఐసీడీఎస్ సూపర్వైజర్ మేరీ, మహిళా పోలీస్ సుజన పాల్గొన్నారు.

● పెదవేగి: ఎంపీడీవో పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో తహసీల్దారు ఎస్.డి.భ్రమరాంబ, ఏపీఎం ఏసు రత్నం, అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్లు సి.హెచ్. పార్వతి, కె.మేరీబాయమ్మ, కె.శాంతారత్నం పాల్గొన్నారు.

● నిడమర్రు: మండల అభివృద్ధి అధికారిణి జి.విజయకుమారి ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం నుంచి యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఈవోఆర్డీ స్వామి, డిప్యూటీ తహసీల్దార్ దుర్గాప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● లింగపాలెం: ఎంపీడీవో కందుల వాణి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రసాద్, ఎంఈవో రామారావు పాల్గొన్నారు.

● టి.నర్సాపురం: ఎంపీడీవో నగరాజ కుమారి ఆధ్వర్యంలో మండల కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, ఏపీవో నాగేశ్వరరావు, పీఆర్ఏఈ సంపత్ కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

● కామవరపుకోట: టీడీపీ మండలాధ్యక్షులు ఏలూరి హరిరామకృష్ణ ఆధ్వర్యంలో యోగాంధ్రను పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

● కుక్కునూరు: మండల కేంద్రంలో యోగాంధ్రలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు.కుక్కునూరు క్రాస్‌రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో తహసీల్దార్ రమేశ్ బాబు, ఎంపీడీవో నరసింహారావు, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు యుగందర్ పాల్గొన్నారు.

● ఉంగుటూరు: యోగాను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. సోమవారం చేబ్రోలులో యోగాంధ్రను పురస్కరించుకుని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచి రాందేలక్ష్మీ సునీత, విశ్రాంత పీడీ ఆదిరెడ్డి సత్యనారాయణ, నగరపాటి సత్యనారాయణ,బొమ్మిడి అప్పారావు, మాజీ సర్పంచి రాందే రాజారావు, యెలిశెట్టి రవి కిశోర్, ఎంపీడీవో జి.రాజ్ మనోజ్ పాల్గొన్నారు. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టి 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆ లోగోను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఆవిష్కరించారు.కార్యక్రమంలో సర్పంచి రాందే లక్ష్మీ సునీత, నగరపాటి సత్యనారాయణ, వి.దుర్గారావు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ సోమవారం మండల కేంద్రంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుంచి నెహ్రూబొమ్మ సెంటరు వరకు ర్యాలీ నిర్వహించగా ఎంపీడీవో కె.జ్యోతి, తహసీల్దార్ పి.వి. చలపతిరావు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: యోగాంధ్రను పురస్కరించుకుని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు జీలుగుమిల్లిలో ర్యాలీ ప్రారంభించారు. ర్యాలీలో సర్పంచ్ చిర్రి జగదాంబ, ఎంపీపీ కొర్స పోశమ్మ, జనసేన పార్టీ మండలాధ్యక్షులు పసుపులేటి రాము, ఎంపీటీసీ నాలి శ్రీను, తహసీల్దారు ఉదయ్, ఎంపీడీవో నిఖిల్ మధుశరణ్ సీఐ బి.వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరస్వామికి అభిషేకాలు

కామవరపుకోట, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : జ్యేష్ఠ మాసంలోని సోమవారం కావడంతో ఉప్పలపాడు పంచాయతీలోని అన్నపూర్ణాదేవి సమేత విశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తులు అభిషేకాలు, బిళ్వార్చనలు నిర్వహించారు. శివనామస్తోత్రాలను పఠించారు. శివపూజలు జరిపారు.



పంపిణీ చేస్తున్న మొక్కలు

ఘనంగా అమ్మా భగవాన్ కల్యాణ మహోత్సవం

ఏలూరు రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం శ్రీపరంజ్యోతి అమ్మా భగవాన్ కల్యాణ మహోత్సవం(తూర్పువీధి, రామాలయంలో) అమ్మా భగవాన్ శిష్యురాలు హరితా దాసాజీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు పాల్గొన్నారు. కల్యాణ మహోత్సవం సందర్భంగా శ్రీకల్కి సేన సమితి ఆధ్వర్యంలో 200 తైవాన్ జామ మొక్కలు పంపిణీ చేశారు.

నియోజకవర్గ స్థాయిలోనూ సమీక్షలుంటాయి

దెందులూరు సమీక్షలో సీఎం చంద్రబాబు



సీఎం వర్చువల్ సమీక్షలో పాల్గొన్న చింతమనేని

దెందులూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలోనే కాకుండా నియోజకవర్గ స్థాయిలో కూడా ఇకపై సమీక్షలు ఉంటాయని ఏపీ సీఎం నారా చంద్రబాబు అన్నారు. సోమవారం స్వర్ణాంధ్ర(2047) విజన్‌పై నియోజకవర్గస్థాయి వీడియో కాన్ఫరెన్స్ ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మూడు నెలల తరువాత మళ్లీ సమీక్ష నిర్వహిస్తామని సంక్షేమ పథకాలపై సలహాలు ఇవ్వాలన్నారు. సమీక్షలో దెందులూరు మండలాధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీతారామ్ ప్రసాద్, గారపాటి కొండయ్య చౌదరి, సంపంగి వేణుగోపాల తిలక్, పెనుబోయిన మహేష్ యాదవ్, ఇప్పిలి వెంకటేశ్వరరావు, డాక్టర్ పసుమర్తి మధుబాబు, తహసీల్దార్ బత్తుల సుమతి, ఎంపీడీవో శ్రీదేవి, అధికారులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర విజన్ కార్యాలయం ప్రారంభం..

ఉంగుటూరు: ఉంగుటూరు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సాయంత్రం సీఎం చంద్రబాబు వర్చువల్‌గా స్వర్ణాంధ్ర(2047) విజన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే ధర్మరాజు నాలుగు మండలాల అధికారులతో ముచ్చటించి రాష్ట్ర అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళికలతో అన్ని రంగాల్లో సర్వతోముఖాభివృద్ధికి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. నాలుగు మండలాల అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శ్రీవారికి చాత్మార్‌సేవ



ద్వారకాతిరుమల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఉభయ దేవేరులతో చిన వెంకన్నకు సోమవారం రాత్రి క్షేత్ర పురవీధుల్లో జరిగిన చాత్మార్ సేవ భక్తులను అలరించింది. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్లను తొళక్కం వాహనంపై ఉంచి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా అట్టహాసంగా తిరువీధులకు తీసుకొచ్చారు. ప్రతీ ఇంటి ముందు భక్తులు స్వామివారి మూర్తులకు హారతులు పట్టారు.

మహిళలపై వ్యాఖ్యలు సరికాదు

జంగారెడ్డిగూడెం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాజధానికి భూములిచ్చిన మహిళలను సభ్య సమాజం అసహ్యించుకునేలా సాక్షి మీడియాలో అసభ్య పదజాలంతో దూషించిన ఇద్దరు జర్నలిస్టులను, అది ప్రసారం చేసిన సాక్షి మీడియా యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ సీనియర్ నాయకుడు మండవ లక్ష్మణరావు సోమవారం డిమాండ్ చేశారు. రాజధానికి భూములిచ్చిన మహిళలను దూషించడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం స్పందించి ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుని రాష్ట్ర మహిళలకు ధైర్యం కల్పించాలని లక్ష్మణరావు డిమాండ్ చేశారు.

విశాఖ ప్లాంట్‌లో అక్రమ తొలగింపులు ఆపాలి : సీఐటీయూ



నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఏలూరు కార్పొరేషన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుల అక్రమ తొలగింపులను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయుల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పాతబస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళనలు నిర్వహించారు. కేంద్ర కార్మిక సంఘాల రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా నిరసన చేపట్టారు. స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుల తొలగింపులు ఆపాలని, విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వెనక్కి తీసుకోవాలని, విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని నినదించారు. సీఐటీయు, ఎఐటీయుసి, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు డి.ఎన్.వి.డి. ప్రసాద్, కె.బుచ్చిబాబు, యర్రా శ్రీనివాస్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పొమ్మనకుండా పొగ పెడుతున్నట్టుగా స్టీల్ ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకు కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తున్నారన్నారు. ఎఐటీయూసీ నాయకులు బండి వెంకటేశ్వరరావు, కె.కృష్ణమాచార్యులు, అప్పలరాజు, పి.కన్నబాబు, లక్ష్మణమూర్తి, పి.కిషోర్, సీఐటీయు నాయకులు సి.హెచ్.సుందరయ్య, వై.ఎస్.కనకారావు, కె.విజయలక్ష్మి, జె.గోపి, కుమార్, ఐఎఫ్‌టీయు నాయకులు గడసాల రాంబాబు, పల్లి గంగరాజు, వెంకటరమణ, అప్పారావు పాల్గొన్నారు.

12న అథ్లెట్ల ఎంపికలు

ఏలూరు రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి):అల్లూరి సీతారామరాజు స్టేడియంలో రాష్ట్ర స్థాయి సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌కు ఎంపికల కోసం ఈ నెల 12వ తేదీన ఏలూరులో జిల్లా స్థాయి అథ్లెట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్టు ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ దేవరాపల్లి ప్రసాద్ తెలిపారు. ఈ ఎంపికలు జిల్లాలోని అన్ని మండలాల అథ్లెట్లకు ఓ గొప్ప అవకాశం అన్నారు. ఎంపికైన ఆయన అథ్లెట్స్ ఆంధ్రప్రదేశ్ సీనియర్ అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపిక చేస్తామన్నారు. ఎంపికలో పాల్గొనే అథ్లెట్లు 2007 జూల్ 7 నాటికి అంతకు ముందుగా జన్మించి వారై ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న అథ్లెట్స్ జనన ధృవీకరణ పత్రాలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో 12వ తేదీ ఉదయం 8గంటల కల్లా హాజరు కావాలని సూచించారు. మరింత సమాచారానికి 62814 31202 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



హోంగార్డు కుటుంబాలతో ఎస్పీ కిశోర్

హోంగార్డు కుటుంబాలను ఆదుకోవడం మా బాధ్యత : ఎస్పీ

ఏలూరు క్రైం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): హోంగార్డు విభాగంలో విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన అమరుల కుటుంబాలను ప్రోత్సహించడం, వారిని ఆదుకోవడం తమ ప్రధాన బాధ్యత అని ఎస్పీ కెపిఎస్ కిశోర్ పేర్కొన్నారు. జిల్లా హోంగార్డు విభాగంలో పనిచేస్తూ అనారోగ్యానికి గురై మృతి చెందినవారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగ నియామక పత్రాలు, రిటైర్డ్ అయిన వారికి జిల్లా హోంగార్డు సిబ్బంది ఒక్క రోజు గౌరవ వేతనాన్ని చెక్కుల రూపంలో ఎస్పీ అందించారు. డెత్ బెనిఫిట్స్, కారుణ్య నియామకం, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఎస్పీ చేతుల మీదుగా ఆయా కుటుంబాలకు అందజేశారు.



వసతి, భోజన సదుపాయాలు పరిశీలిస్తున్న రత్న ప్రసాద్

నిరాశ్రయుల వసతిపై పర్యవేక్షణ అవసరం

ఏలూరు క్రైం, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : వృద్ధులకు, నిరాశ్రయులకు అందిస్తున్న భోజన వసతిపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉమ్మడి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ ఆదేశించారు. పత్తేబాదలోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని రత్నప్రసాద్ సందర్శించారు. ఏలూరు పరిధిలోని వసతి గృహాలను తరచూ సందర్శించి రిపోర్టును రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థకు సమర్పించాల్సి ఉందన్నారు. అవసరమైతే పారా లీగల్ వలంటీర్ల సహయాన్ని అందిస్తామన్నారు. పరిసరాల శుభ్రత, మురుగు కాల్వల శభ్రత విషయంలో సంబంధిత అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని రత్నప్రసాద్ సూచించారు.

హైఓల్టేజ్‌తో కాలిపోయిన పరికరాలు

జంగారెడ్డిగూడెం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డాంగే నగర్‌లో హై ఓల్టేజ్ కారణంగా ఐదు కుటుంబాలకు చెందిన రూ.లక్షల విలువ కలిగిన ఫ్రిజ్, ఏసీ, ఫ్యాన్లు, ఇన్వెర్టర్లు కాలిపోయాయి. ఆ ప్రాంతంలో విద్యుత్ హెచ్చు తగ్గుల కారణంగా సోమవారం తెల్లవారు జాము మూడు గంటల ప్రాంతంలో ఒకే సారి విద్యుత్ హై ఓల్టేజ్ రావడంతో ఇళ్లలో పెద్ద పెద్ద శబ్దాలు రావడంతో నిద్ర కళ్లతోనే వారంతా బయటకు పరుగులు తీశారు. తేరుకున్న తరువాత చూసే సరికే హై ఓల్టేజ్ కారణంగా ఎలక్ట్రానిక్ పరికరాన్నీ కాలిపోయాయి.

నేడు మద్ది ఆంజనేయ స్వామి ఆలయంలో యోగాంధ్ర

జంగారెడ్డిగూడెం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): యోగాంధ్రలో భాగంగా మండలంలోని గురవాయిగూడెంలోని మద్ది ఆంజనేయ స్వామి ఆలయంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం యోగాంధ్రను నిర్వహిస్తున్నట్టు కలెక్టరు కె.వెట్రిసెల్వి తెలిపారు. 21న అంతర్జాతీయ యోగాను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు మెరుగైన జీవన విధానం, ఆరోగ్య ప్రయోజనాల కోసం యోగా ప్రాముఖ్యతను ప్రజలకు వివరించడంతో పాటు యోగాసనాల పట్ల ఆసక్తి కల్పించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ద్వారకాతిరుమల, పట్టిసీమ పుణ్య క్షేత్రాల్లో నిర్వహించామని, 10న గురవాయిగూడెంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18న కామవరపుకోట మండలం జీలకర్రగూడెం, గుంటుపల్లి బౌద్ధారామాల వద్ద యోగాంధ్ర నిర్వహిస్తామన్నారు. ఇప్పటికి యోగాంధ్రలో పాల్గొనేందుకు 7,76,117 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు కలెక్టరు తెలిపారు.

నేడు విద్యుత్ నిలిచిపోయే ప్రాంతాలివే..

జంగారెడ్డిగూడెం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ డివిజన్ పరిధిలోని గ్రీన్‌ఫీల్డ్ హైవేపై వెళ్తున్న ట్రాన్స్‌కో టవర్ లైన్ల మార్పు లకు జరుగుతున్న పనుల కారణంగా మంగళ వారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలు గుతుందని విద్యుత్ శాఖ ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ సోమవారం తెలిపారు. జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలలో మం గళవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలి చిపోతుందన్నారు.

గుడివాకలంక సబ్‌స్టేషన్ పరిధిలో

ఏలూరు రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం చాటపర్రు సెక్షన్ 33 కెవి/ 11 కేవీ గుడివాకలంక సబ్‌స్టేషన్ పరిధిలో క్రొత్త 33 కేవీ లైన్ పోల్స్ ఏర్పాటు నిమిత్తం మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొక్కిరాయిలంక, పైడిచింతపాడు, ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపో తుందని, ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కెఎం అంబేడ్కర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

11న క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్

ఏలూరు అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): వివిధ కంపెనీల్లో ఉద్యోగ నియామకాలకు ఈ నెల 11న ఉదయం 10గంటల నుంచి ఏలూరు సత్రంపాడులోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ పి.రజిత తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణతతో అప్రంటీస్ చేసిన అభ్యర్థులు, ఐటీఐ చివరి సంవత్సరం చదువుతున్న ట్రైనీలు ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు హాజరుకావచ్చన్నారు. అన్ని ధ్రువపత్రాలు, ఎస్ఎస్‌సీ మార్కుల మెమో, ఐటీఐ మార్కుల మెమో, ఐడీ ప్రూఫ్, ఫొటో గ్రాఫ్‌లతో అభ్యర్థులు హాజరుకావాలన్నారు. వివరాలకు ప్రభుత్వ ఐటిఐ కార్యాలయ(08812-230269)ను సంప్రదించాలని సూచించారు.

నోట్ పుస్తకాల పంపిణీ

టి.నర్సాపురం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెడ్లం ఆర్‌సీఎం చర్చ్‌లో సోమవారం నిర్వహించిన బాలల జూబ్లీ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నాలుగు నుంచి 10వ తరగతి విద్యార్థులు ఏలూరు విచారణ గురువు ఫాదర్ బాల చేతుల మీదుగా 350 మంది విద్యార్థులకు పెన్నులు, నోట్ పుస్తకాలు, ప్యాడ్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. విద్యార్థుల చదువుల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఫాదర్ జ్ఞాన ప్రకాశ, ఫాదర్ ప్రసాద్, తెడ్లం విచారణ గురువు ఫాదర్ విజయ్ అజలోలు పాల్గొన్నారు.



శ్రీవారి దర్శనానికి బయల్దేరిన భక్తులు

పెదతిరుపతికి కాలినడకన..

లింగపాలెం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పెద తిరుపతి వెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు మండలంలోని రంగాపురం, నరసన్నపాలెం గ్రామాల నుంచి 27 మంది భక్తులు కాలినడకన బయల్దేరి వెళ్లారు. భక్తులు మాట్లాడుతూ గత ఏడేళ్లుగా స్వామిని దర్శించుకునేందుకు కాలినడకన వెళుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోనే రెండో అన్నవరంగా భావించే రంగాపురం సత్యనారాయణ స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం నడక ప్రారంభించారు.

పెట్టుబడి సాయం అందించాలి

చింతలపూడి, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : రైతులకు, భూమిలేని కౌలు రైతులకు ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందించాలని ఏపీ కౌలు రైతు సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘ నాయకులు కృష్ణ మాట్లాడుతూ రైతులతో పాటు కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించాలని, 90 శాతం సబ్సిడీతో నాణ్యత కలిగిన అన్ని రకాల విత్తనాలు ఇవ్వాలన్నారు. సమావేశంలో సంఘ నాయకులు ఎస్.కె.కాలేషా, కంచర్ల గురవయ్య తదితరులు ఉన్నారు.

దోమ తెరలు వాడుదాం

ఉంగుటూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): దోమ తెరలు వాడుదాం - దోమకాటు నుంచి రక్షణ పొందుదామనే నినాదంతో సోమవారం కాగుపాడు పి.హెచ్.సి. ఆధ్వర్యంలోని కొత్త ఉంగుటూరులో ఆమెన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 102 మందికి దోమ తెరలను పంపిణీ చేశారు. కాగుపాడు వైద్యాధికారిణి మానస, తాడేపల్లిగూడెం మలేరియా యూనిట్ ఆరోగ్య ఉప అధికారి వై.వి.లక్ష్మణరావు, ఆమెన్ ట్రస్టు చైర్మన్ సిస్టర్ జలిన్, మేనేజర్ అశోక్, ఆరోగ్య విస్తరణాధికారి కె.శ్రీనివాసరావు, పర్యవేక్షకులు ఎన్.సత్యనారాయణ, గణపతి, చంద్రలీల పాల్గొన్నారు.

మహిళ మృతిపై కేసు నమోదు

టి.నర్సాపురం, జూన్9 (ఆంధ్రజ్యోతి):మహిళ అనుమానస్పద స్థితిలో మృతి చెందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్.ఐ. ఎం. జయబాబు సోమవారం తెలిపారు. మండలంలోని చిన్నగుర్వాయిగూడెంలో టి.భూలక్ష్మి(45) అనే మహిళ కొంత కాలంగా గ్రామంలోని ఒక ప్రార్థనా మందిరం వద్ద నివసిస్తోంది. ఆదివారం రాత్రి ఆమె అనుమానస్పద స్థితిలో మృతి చెందింది. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్.ఐ. తెలిపారు.



ఆగిరిపల్లిలో యోగాంధ్ర అవగాహన ర్యాలీ



ముదినేపల్లిలో ర్యాలీ

సబ్ కలెక్టర్‌కు సమస్యలు తెలిపిన కోకో రైతులు



నూజివీడు టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కోకో గింజల సేకరణ నెలకు రెండు సార్లయినా జరిగేలా చర్యలు చేపట్టాలని రైతులు సబ్ కలెక్టర్ బి. స్మరణ్‌రాజ్‌ను కోరారు. నూజివీడు మండలం ముక్కొల్లుపాడు గ్రామ పరిధిలో కోకో రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి కోకో రైతులుగా గుర్తింపు పొందాలని తద్వారా సర్టిఫికెట్లు అందించడంతో పాటు కనీస మద్దతు ధర రూ.500 ఇవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు. కంపెనీల నిర్వాహకులు గ్రామాలకు వచ్చి కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎమ్మార్వో భద్రునాయక్, డిప్యూటీ తహసీల్దార్ బి. సుబ్బారావు, ఉద్యానవన శాఖ అధికారిణి ఆర్. హేమ, కోకో రైతులు పాల్గొన్నారు.

దేదీప్య సాయికి మంత్రి చేతుల మీదుగా పురస్కారం



నూజివీడు టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన నూజివీడు శారదా జూనియర్ కళాశాల విద్యార్థిని కుప్పాల దేదీప్య సాయి ఏలూరులో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర పౌర సంబంధాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా ప్రతిభ పురస్కారాన్ని స్వీకరించింది. ఇంటర్మీడియట్‌లో 991 మార్కులు సాధించి ఈ పురస్కారానికి ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ కె శంకరరావు తెలిపారు.

విద్యార్థులకు ప్రతిభ అవార్డులు



ముసునూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడుగురు విద్యార్థులు సోమవారం ప్రతిభ అవార్డులను అందుకున్నారు. పదవ తరగతిలో మంచి మార్కులు సాధించిన గురుకుల బాలికలు కొప్పుల సాయి సింధు, టి.సాహితి, ఎం.ప్రియాంక, టి.ఐశ్వర్య, ఐ.హిమబిందు, చెక్కపల్లి జడ్పీ, చైతన్య పాఠశాలల విద్యార్థులు వడ్డేపల్లి దివ్యహర్షిణి, బొలుసు లీలాకృష్ణ ఏలూరులో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, రాష్ట్ర పౌర సంబంధాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ నాదెండ్ల మనోహర్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకరరావు చేతులు మీదుగా మెడల్, నగదు బహుమతులను అందుకున్నారు. విద్యార్థులకు ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు, హెచ్‌ఎంలు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ముదినేపల్లి: ఈ ఏడాది టెన్త్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన ముదినేపల్లి మండలంలోని ఆరుగురు విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభ అవార్డులు (షైనింగ్ స్టార్స్) దక్కాయి. మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన ఇండో సాక్సన్ హైస్కూలుకు చెందిన కాగిత దేవి వీర వెంకట నాగ శృతి, పెయ్యేరు లిటిల్ ఫ్లవర్ ది లీడర్ హైస్కూలుకు చెందిన యర్రంశెట్టి సాయి ప్రణవి, సహాయ మాతా స్కూలుకు చెందిన ముక్కు జాహ్నవి, కొడాలి జగదీష్, ముదినేపల్లి లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూలుకు చెందిన బండి తీక్షణ్, యలమంచిలి చంద్రహాస్ కృష్ణ సోమవారం ఏలూరులో జరిగిన కార్యక్రమంలో మంత్రి, కలెక్టర్ చేతులమీదుగా ప్రతిభ అవార్డులు అందుకున్నారు. ఈ విద్యార్థులు 580 మార్కులకు పైబడి సాధించారు.



ఉమ్మడి జిల్లాలో ఏఎంసీ సెక్రటరీల బదిలీలు

ఏలూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ పరిధిలో పలు చోట్ల పనిచేస్తున్న వివిధ హోదాల్లోని సెక్రటరీలను బదిలీ చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులిచ్చారు.

సెక్రటరీ	ప్రస్తుత స్థానం	బదిలీ ప్రాంతం
ఎంఎన్‌వీ ప్రభాకరావు	తాడేపల్లిగూడెం	భీమవరం
షేక్ గౌస్ భాషా	అత్తిలి	తాడేపల్లిగూడెం
ఎన్.శ్రీనివాసరావు	దుగ్గిరాల	కొవ్వూరు
ఎ.శారదా రాణి	ఏలూరు	విజయవాడ
జి.మంజుల	మచిలీపట్నం	ఏలూరు
బి.సౌజన్య	కైకలూరు	గుడివాడ
యు.యోగీశ్వరరావు	చిలకలూరి పేట	ఆకివీడు
జి.ప్రసన్న కుమారి	భీమవరం	పొన్నూరు
టీసీ. రామాంజనేయులు	పెనుగొండ	కావలి
సీహెచ్ సుబ్బారావు	ఆకివీడు	తెనాలి
డి.తిరుపతి రాయుడు	తణుకు	చిలకలూరిపేట
కె.ఆనంద్ (ఏడీఎం)	అవనిగడ్డ	ఉంగుటూరు
వి.మహేంద్రనాథ్(ఏడీఎం)	ఏలూరు	భీమడోలు
ఎంబీవీ శ్రీనివాసరావు (ఏడీఎం)	దెందులూరు	ఏలూరు(ఏడీఎం)

ఐసీడీఎస్‌లోనూ...

ఏలూరు జోన్ మహిళా శిశు, అభివృద్ధి సంస్థ పరిధిలో కృష్ణా, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల్లోని పలు కేడర్లలో పనిచేసే 153 మందిని సోమవారం బదిలీ చేశారు. అంగన్‌వాడీ గ్రేడ్-1 సూపర్‌వైజర్లు 46 మంది, గ్రేడ్-2 52 మంది, జూనియర్ అసిస్టెంట్లు 19 మంది, సీనియర్ అసిస్టెంట్లు 18 మంది, సబార్డినేట్లు 17 మంది, ఒక వార్డెన్ బదిలీ అయ్యారు.

కృత్రిమ కాళ్ల వితరణ



ఆగిరిపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఎన్ఆర్ఐ బొబ్బ మంజుల ఆర్థిక సాయంతో తోటపల్లిలోని హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో కర్నూలుకు చెందిన పి. మేఘన, నూజివీడుకు చెందిన షేక్ సుబానిలకు విశ్రాంత ఆర్‌అండ్‌బీ ఇంజనీర్ తాతినేని జితేంద్రనాథ్, స్వర్ణకుమారి చేతుల మీదుగా కృత్రిమ కాళ్ళను అమర్చారు. ఈ సందర్భంగా హీల్ ఫెసిలిటీస్ డైరెక్టర్ టి. భాస్కర్ మాట్లాడుతూ హీల్ కృత్రిమ అవయవ కేంద్రం ద్వారా ఇప్పటి వరకు 709 మందికి కృత్రిమ కాళ్ళు అందజేసినట్లు తెలిపారు. హీల్ సీఈవో కూరపాటి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	






నూజివీడులో యోగాంధ్ర ర్యాలీ.. సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో..

ముసునూరు, కలిదిండిలో అవగాహన ర్యాలీల్లో పాల్గొన్న అధికారులు

యోగాతో ఆరోగ్యం

యోగాంధ్రపై అవగాహన ర్యాలీలు నిర్వహించిన అధికారులు

నూజివీడు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్ అన్నారు. సోమవారం నూజివీడు మండల ప్రజా పరిషత్ ఆవరణ నుంచి యోగాంధ్ర ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ నూజివీడు సంపూర్ణ ఆరోగ్య యోగా మండలంగా గుర్తింపు పొందాలంటే పొదుపు మహిళలు ప్రతి కుటుంబానికి యోగాను పరిచయం చేయాలన్నారు. ఎంపీడీవో చెన్నా రాఘవేంద్రనాథ్ మాట్లాడుతూ ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందన్నారు. మహిళలు యోగాభ్యాసం చేస్తే కుటుంబ వ్యవస్థ చక్కగా ఉంటుందన్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ బి. సుబ్బారావు, మండల వ్యవసాయ అధికారి చాముండేశ్వరి, ఎంఈవో సేవ్యానాయక్, ఏపీఎం ప్రసాద్, ఏపీవో మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: నూజివీడు మండల, పట్టణ ప్రాంతాలలో సోమవారం యోగాంధ్ర ర్యాలీలు నిర్వహించారు. ఆరోగ్యకరమైన సమాజం కోసం యోగా కీలక పాత్ర పోషిస్తుందని అవగాహన కల్పిస్తూ నూజివీడు మున్సిపల్ కార్యాలయం నుంచి మున్సిపల్ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు ర్యాలీలో పాల్గొన్నారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు టీడీపీ నాయకులు రామరాజు తదితరులు పాల్గొన్నారు. ఇక నూజివీడు మండలంలోని పలు గ్రామాల్లోనూ ర్యాలీలను నిర్వహించారు. ముఖాసా నరసన్నపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో నూజివీడు మండల క్లస్టర్ ఇన్‌చార్జి యనమదల సచివాలయ సిబ్బంది, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ముసునూరు: యోగాంధ్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో సత్యనారాయణ, తహసీల్దార్ రమణ పిలుపునిచ్చారు. సోమవారం ముసునూరులో యోగాంధ్ర ర్యాలీని వారు నిర్వహించి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మనిషి అనేక సమస్యలలో ఒత్తిడికి గురై అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాడని అన్నారు. మనిషికి ప్రశాంత యోగాసనాలతోనే సాధ్యమౌతుంద న్నారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగా చేయాలని కోరారు. ర్యాలీలో టీడీపీ నాయకులు కొండేటి ఉదయ్ కిరణ్ (బాబి), తోట శ్రీనివాసరావు, యోగా ట్రైనర్ కుమార్, కార్యదర్శి వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మార్వో ఎంవీఎన్ ప్రసాద్, ఎంపీడీవో పి. భార్గవి, ఎస్ఐ శుభశేఖర్ ముఖ్య అతిథులుగా, టీడీపీ మండల అధ్యక్షుడు నక్కనబోయిన వేణు ఆధ్వర్యంలో యోగాంధ్ర అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎమ్మార్వో, ఎంపీడీవో మాట్లాడుతూ రోజూ కనీసం 10 నిమిషాలైనా యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. మాదల సత్యకుమార్, ఆరేపల్లి శ్రీనివాసరావు, ఈదర సర్పంచ్ దొండపాటి ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: కలిదిండిలో అధికారులు, ప్రజాప్రతినిధులు యోగాంధ్రపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. యోగా ప్రాముఖ్యాన్ని వివరించారు. ఎంపీడీవో కొండలరావు, తహసీల్దార్ రామకృష్ణ, కలిదిండి పీహెచ్‌సీ వైద్యాధికారి హేమంత్, సర్పంచ్ మారుతి ప్రసన్న, వీఆర్వోలు పాల్గొన్నారు. పెదలంకలో సర్పంచ్ మోకా లక్ష్మీ రామకృష్ణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. టీడీపీ నాయకులు దున్న భోగేశ్వర రావు, అక్కల వెంకటాచలం, దుగ్గిరాల చంద్రశేఖర్, ఇమ్మానేని సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి సురేష్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లిలో సోమవారం యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎంపీడీవో వై.రామకృష్ణ, తహసీల్దార్ పవన్ కుమార్, సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, డిప్యూటీ ఎంపీడీవో అశోక్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు, వైద్య సిబ్బంది, పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పాల్గొని ఈ నెల 21న విశాఖలో జరుగనున్న రాష్ట్రస్థాయి యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. యోగాసనాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.



కైకలూరులో సబ్ జైలును పరిశీలిస్తున్న జైళ్ల శాఖ డీఐజీ వరప్రసాద్

ఆధునిక వసతులతో జైలు నిర్మాణం

కైకలూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జైళ్లల్లో ఖైదీలకు అన్ని మౌలిక వసతులతో అధునాతన భవనాలు నిర్మిస్తున్నట్లు జైళ్ల శాఖ డీఐజీ ఎం. వరప్రసాద్ అన్నారు. సోమవారం కైకలూరులో సబ్ జైల్లో నిర్మిస్తున్న జైలు భవనాన్ని, పెట్రోల్ బంకును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడు తూ పురాతన సబ్ జైలు కైకలూరులో ఉండేదని అయితే పల్లపు ప్రాంతంలో ఉండడంతో కొల్లేరు ముంపు వచ్చినప్పుడల్లా మునిగిపోవడమే గాక ఖైదీలకు గదులు ఇరుకుగా ఉండి గాలి, వెలుతురు సక్రమంగా లేకపోవడంతో నూతన భవన నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఏలూరు జిల్లాలో కైకలూరులో మాత్రమే నూతన సబ్‌జైలు భవనం నిర్మిస్తున్నామని పురుషులకు 4, స్త్రీలకు 2 సెల్స్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అలాగే సబ్‌జైలు ఆవరణలో నిర్మించిన పెట్రోలు బంకు వచ్చే నెలలో ప్రారంభో త్సవం చేస్తామని ఖైదీల జీవనోపాధి కోసం దీనిని నిర్మించామన్నారు. విజయవాడ డీఎస్‌జేడీ ఆఫీస్ జైల్ అధికారి వి. ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

గంజాయిని అరికడతాం

వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే కామినేనికి సీఎం చంద్రబాబు హామీ

కైకలూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్‌ను పూర్తిస్థాయిలో అరికట్టి సమాజంలో ఖచ్చితంగా మార్పు తీసుకువస్తానని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. సోమవారం కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర -2047 నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్‌పై జరిగిన వీడియో కాన్ఫరెన్సులో కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ పాల్గొన్నారు. నియోజకవర్గాల వారీ సమీక్షలో ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ సర్వేలో 10 నుంచి 15 ఏళ్ల వయస్సులో బాలికలు సర్వైకల్ క్యాన్సర్ బారిన పడుతున్నట్టు తేలిందని, ప్రభుత్వం తరపున వ్యాక్సిన్ సరఫరా చేసి వ్యాధి బారిన పడకుండా కాపాడాలని సీఎం కోరారు. అలాగే గంజాయిని అరికట్టినా అది సేవించే వారికి నిత్యం లభిస్తోందని దీంతో యువత భవిష్యత్తు నాశనం అవుతోందని దీనిని అరికట్టి యువతను కాపాడాలని సీఎంను ఆయన కోరారు. దీనిపై



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే కామినేని

స్పందించిన సీఎం రాష్ట్రంలో గంజాయిని వంద శాతం అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు తీసుకున్నామని, డ్రగ్స్‌ను నియంత్రిస్తున్నామన్నారు. కొంతమంది గంజాయి దొరకక మెంటల్‌గా డిస్టర్బ్ అయి సమాజాన్ని పాడుచేస్తున్నారని అలాంటి పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకుని వారిని కంట్రోల్ చేయాలన్నారు. ఎంపీపీ అడవి కృష్ణ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి నరసయ్య, తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం, ఎండీవోలు ఆర్. ఫణీంద్ర, రామలింగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు క్షమాపణ చెప్పాలి



నాగబాబు

ముసునూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కాలకేయుల పాపాలకు ప్రాయశ్చిత్తం లేదని, మహిళా లోకానికి వైసీపీ నేతలు బహిరంగ క్షమాపణ చెప్పాలని నియోజకవర్గ జనసేన నాయకుడు పాశం నాగబాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రధాని సహకారంతో చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల నేతృత్వంలో రాజధాని నిర్మాణం శరవేగంగా జరగడాన్ని వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. రాజధాని మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టులు, సాక్షి ఛానల్ చైర్మన్ వైయస్ భారతీరెడ్డిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

బలుసులమ్మ జాతర ప్రారంభం

ముదినేపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఐనంపూడిలోని బలుసులమ్మ ఆలయంలో సోమవారం జాతర మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలోని వినాయక, వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సమేత బలుసులమ్మ వారికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పెద్దింటి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో లక్ష్మీ గణపతి హోమం, అభిషేకాలు నిర్వహించారు. మంగళవారం స్వామి కల్యాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు.



ఐదు అంశాలపై దృష్టి పెట్టండి

స్వర్ణాంధ్ర మిషన్‌పై వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు సీఎం దిశా నిర్దేశం

నూజివీడు టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర మిషన్-2047 కార్యక్రమంపై సీఎం చంద్రబాబునాయుడు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో నూజివీడు నియోజకవర్గ అధికారులు పాల్గొన్నారు. స్వర్ణాంధ్ర మిషన్ విజయవంతం చేసేందుకు వ్యవసాయం-నీటిపారుదల, పారిశుద్ధ్యం-పర్యావరణ పరిరక్షణ, విద్యా-వైద్య రంగం, యువశక్తి-ఉద్యోగావకాశాల కల్పన, మౌలిక సదుపాయాల అభివృద్ధి తదితర అంశాలపై ప్రధానంగా దృష్టి సారించాలని అందుకు గల అవకాశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని ఆదేశించినట్లు నూజివీడు ఎంపీడీవో చెన్ను రాఘవేంద్రనాథ్ తెలిపారు.



నూజివీడు రూరల్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేస్తున్న ఎన్డీయే నాయకులు



చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళలు

కొనసాగుతున్న ఫిర్యాదుల పర్వం

నూజివీడు టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సాక్షి టీవీ డిబేట్‌లో అమరావతి మహిళలను కించపరిచేలా మాట్లాడిన జర్నలిస్టులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదుల పర్వం కొనసాగుతోంది. నూజివీడు రూరల్ మండల ఎన్డీయే నాయకులు నూజివీడు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నూజివీడు నియోజకవర్గ బీజేపీ నాయకులు గోగినేని శ్రీనివాస కుమార అప్పారావు, వైయస్ దొరై తదితరుల ఆధ్వర్యంలో నూజివీడు రూరల్ పోలీసు స్టేషన్లో ఈ మేరకు ఫిర్యాదు చేశారు. మహిళలను కించపరుస్తూ మాట్లాడటం తగదని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. టీడీపీ నాయకులు గోగినేని మధు, మున్సిపల్ కౌన్సిలర్ పాదం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మహిళలను కించపరచడంపై ఆగ్రహం

చాట్రాయి: అమరావతి మహిళలపై సాక్షి చానల్‌లో అసభ్యకర వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టు కృష్ణంరాజు, యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావుపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు మాదాసు చంద్రకళ ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందజేశారు. కృష్ణంరాజు, కొమ్మినేనిలతో పాటు సాక్షి యాజమాన్యంపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మందపాటి బసవారెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు, అత్తులూరి శ్రీనివాసరావు, ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, మరిడి చిట్టిబాబు, బొట్టు లక్ష్మణరావు, నేబులిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొల్లేరు సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి

(5వ పేజీ తరువాయి)

ఒక జిరాయితీ, డీఫామ్ పట్టాలను మాత్రమే మనం కాంటూరు నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని దీని సాధనకు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ, ఎంపీలు పుట్టా మహేశ్‌కుమార్, పాకా వెంకట సత్యనారాయణ, ఐదు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కృషి చేస్తున్నామన్నారు. గ్రామాల వారీగా వివరాలను అందరూ సేకరించి త్వరితగతిన అప్పగించాలని సూచించారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ సీఈసీ కమిటీ వచ్చిన సమయంలో ప్రజలంతా మౌలిక సదుపాయాలను అడగాలని, కమిటీ స్పందించేలా నడుచుకోవాలన్నారు. అందరూ కలిసికట్టుగా గ్రామ సభల ద్వారా తీర్మానం చేసి అందించాలన్నారు. కొల్లేరు సరస్సులో వాస్తవ సంఘటనలు, వాజ్యాల పత్రాల సంకలనంతో పెదనిండ్రకొలను గ్రామానికి చెందిన మాచవరపు నాగ సత్యగంగాధరం తయారుచేసిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. చేపలరైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నంబూరి వెంకటరామరాజు, నంబూరి శివాజీరాజు, ఘంటసాల వెంకటలక్ష్మి, కమ్మిలి విఠలరావు, కన్వీనర్ బలే ఏసురాజు, సైదు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్.. షాక్..

(5వ పేజీ తరువాయి)

పరిశ్రమలు, వ్యాపారులకు పెట్టుబడి భారమవుతుంది. చిన్న పరిశ్రమల నిర్వహణకు ఇది మరో గుదిబండ.

సమాచారం ఉండదు..

ప్రస్తుతం విద్యుత్ బిల్లులో వాడిన యూనిట్లు, చెల్లించాల్సిన ధర, కస్టమర్ చార్జీల వివరాలు స్పష్టంగా ఉంటాయి. ప్రిపెయిడ్ విధానంలో యూనిట్‌కు ఎంత వసూలు చేస్తున్నారనే వివరాలు నేరుగా లభ్యమయ్యే పరిస్థితులు ఉండవని పలువురు చెబుతున్నారు.

మున్ముందు భారమే..



ఇప్పటికే స్మార్ట్ మీటర్లు పెట్టినవారికి బిల్లులు మాములుగానే వస్తున్నాయి కదా అన్న ప్రశ్న ఉదయించవచ్చు. ఇంకా అందరికీ స్మార్ట్‌మీటర్లు బిగింపు కార్యక్రమం పూర్తికాలేదు. అందరికీ ఈ మీటర్లు బిగింపు పూర్తయిన తరువాత ఈ మీటర్ల అసలు పని ప్రారంభమవుతుంది. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో ఈ కార్యక్రమం జరుగుతుంది. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానాన్ని పూర్తిగా వ్యతిరేకించింది. తమ రాష్ట్రంలో అమలు చేయమని స్పష్టంగా కేంద్రానికి తెలిపింది. కేరళ ప్రభుత్వ కూడా ఈ మీటర్ల బిగింపునకు వ్యతిరేకించింది. మన రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ విషయంపై పునరాలోచించి ఇచ్చిన వాగ్దానాన్ని నిలుపుకొని ప్రజాపక్షం అని నిరూపించుకోవాలి.

-జి.రాజు, సీపీఎం నాయకుడు

చేపల చెరువు తవ్వకాన్ని అడ్డుకున్న గ్రామస్థులు

ముదినేపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం చేవూరుపాలెం గ్రామ సమీపంలో ఒక రైతు చేపట్టిన చేపల చెరువుల తవ్వకాలను సోమవారం ఆ గ్రామస్థులు అడ్డుకున్నారు. చెరువు పోరంబోకులో ఉన్న శ్మశాన వాటిక పక్కనే చెరువు తవ్వకం నిలిపేయాలని, పంట బోదెకు ఏర్పాటు చేసిన తూములను తొలగించాలని డిమాండ్ చేస్తూ తవ్వకం పనులను అడ్డుకున్నారు. గ్రామస్థుల ఫిర్యాదుతో తహసీల్దార్ పవన్‌కుమార్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, వీఆర్‌వో ఏడు కొండలు, సర్వేయర్ జీవన్ చెరువు తవ్వకాన్ని పరిశీలించారు. శ్మశాన వాటికకు దూరంగా చెరువు తవ్వాలని, పంట బోదెకు ఏర్పాటు చేసిన తూములను తొలగించాలని



తవ్వకాలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికార్లు

గ్రామస్థులు పట్టుబట్టగా అధికార్లు చెరువు తవ్వకానికి మార్కింగ్ ఇచ్చారు. శ్మశానం పోరంబోకు భూమిని వదిలివేయాలని అధికార్లు తెలిపారు.



'ఇజ్జిగాని'కి అభినందన

చాట్రాయి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండల టీడీపీ అధ్యక్షుడిగా ఎన్నికైన ఇజ్జిగాని వెంకటేశ్వరరావును తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, టీడీపీ మండల నాయకులు నక్కా రాము, గుడిమళ్ళ బ్రహ్మయ్య అభినందించారు. తొలిసారి బలహీనవర్గానికి చెందిన ఇజ్జిగాని మండల అధ్యక్షుడిగా ఎన్నిక కావటం హర్షణీయమన్నారు.



చాట్రాయిలో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు

వణికిపోయాం..

ఆదివారం నాటి గాలివాన బీభత్సం ఆందోళన కలిగించిందన్న గ్రామస్థులు

చాట్రాయి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండలంలో ఆదివారం గాలివాన ఉగ్రరూపానికి ప్రజలు గజగజలాడారు. ఎంతో ఆందోళనకు గురయ్యామని గ్రామస్థులు వాపోయారు. వందలాది చెట్లు నేల కూలటంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఎస్సై రామకృష్ణ, పోలీస్ సిబ్బంది ఎక్సకవేటర్‌తో రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లు తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు. పామాయిల్, మామిడి చెట్లు వేళ్ళతో సహా కూలిపోయాయని రైతులు లబోదిబోమంటున్నారు. పేదల రేకుల షెడ్ల పైకప్పు ఎగిరిపోవటతో తీవ్రంగా నష్టపోవటమే కాక అవస్థలు పడుతున్నారు. సుమారు 100 విద్యుత్ స్తంభాలు, 25 ట్రాన్స్‌ఫార్మర్లు కూలిపోవటంతో 20 గంటలు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి ప్రజలు ఉక్కపోత, దోమల మోతతో నరకయాతన అనుభవించారు. రక్షిత పథకాలు పనిచేయక ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. యుద్ధప్రాతిపదికన పనులు చేసి విద్యుత్ పునరుద్ధరించినట్టు విద్యుత్ శాఖకు సుమారు రూ. 15 లక్షలు నష్టం వాటిల్లినట్టు విద్యుత్ ఏడీ వీరబాబు, ఏఈ సంజయ్ తెలిపారు. ఇంత భారీ గాలివాన తాము ఎప్పు డూ చూడలేదని వృద్ధులు తెలిపారు. చాట్రాయి, పోతనపల్లి, బూరుగ్గూడెం, జనార్దనవరం, జయపురం, పోలవరం గ్రామాల్లో గాలివాన ప్రభావం ఎక్కువగా ఉంది.

18 ఇళ్ళకు నష్టం : తహసీల్దార్

గాలివాన బీభత్సానికి చాట్రాయిలో 9 ఇళ్ళు, ఒక గొర్రెల షెడ్డు పూర్తిగా, 5 ఇళ్ళు పాక్షికంగా, బూరుగ్గూడెంలో ఒక ఇల్లు పూర్తిగా, 2 ఇళ్ళు పాక్షికంగా దెబ్బతిన్నాయని తహసీల్దార్ ఈశ్వరరావు తెలిపారు. ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామన్నారు.